

రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నాం. స్థానిక సంస్థల్లోనూ కూటమికి మద్దతిస్తే కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల సమన్వయంతో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడి గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

గురువారం 19.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 208 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

విద్యుత్ డిమాండ్‌కు దీటుగా ప్రణాళిక



ప్రతి ఎనర్జీ ప్రాజెక్టు పనులు మొదలవ్వాలి

ప్రైవేటు విద్యుత్‌పై ఆధారపడటం తగ్గించాలి

పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు కార్యాచరణ


అధికారులకు చంద్రబాబు సీఎం దిశానిర్దేశం

అమరావతి, నవంబర్ 18(జర్నలిస్ట్‌ఫైల్) : రాష్ట్రంలో పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్ అంచనా వేసి తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించి తక్షణం వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. వచ్చే 6 నెలల్లో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎల్ నినో వంటి సమస్యల కారణంగా వర్షాకాలంలో కూడా విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగిందని...ఇలాంటి సవాళ్లను ముందుగానే అంచనా వేసుకుని ఎదుర్కోవాలని ముఖ్యమంత్రి సూచించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ రంగంపై ఆ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు విద్యుత్ డిమాండ్ 18.23 శాతం పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంతో పాటు మార్కెట్‌లో విద్యుత్ ధరలు కూడా తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం ప్రైవేటు సంస్థలపై ఆధారపడడం తగ్గించాలని సీఎం సూచించారు. దీనికోసం ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వ ప్రాజెక్టులు గ్రౌండ్ చేయాలన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని ఎన్నికల్లో హామీ ఇచ్చామని...దానికి కట్టుబడి ఉన్నామని గుర్తు చేసిన సీఎం... విద్యుత్ కొనుగోలు భారం తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ డిమాండ్, ఉత్పత్తి, సరఫరా వంటి అంశాల్లో ఏఐ వంటి టెక్నాలజీని ఉపయోగించి సామర్థ్యం పెంచుకోవాలన్నారు. అప్పుడు అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయాల్సిన అవసరం కూడా ఉండదని సీఎం అన్నారు.

చోరీలపై కఠిన చర్యలు : విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల చోరీల అంశం కూడా సమీక్షలో చర్చకు వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో, పొలాల్లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్లు పెద్ద ఎత్తున చోరీకి గురవుతున్నాయని అధికారులు తెలిపారు. రాగి తీగలు కోసం ట్రాన్స్ ఫార్మర్లు దొంగిలిస్తున్నారని అధికారులు తెలుపగా....ఇటువంటి చర్యలకు పాల్పడుతోన్నవారిపట్ల అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడంతో పాటు విద్యుత్ సరఫరాలో సమస్యలకు కారణం అవుతున్న వారిని వదిలిపెట్టవద్దని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో దర్యాప్తునకు పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలని... చోరీలకు పాల్పడే వారికి గట్టి గుణపాఠం చెప్పాలని సీఎం అన్నారు.

గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వేగవంతం కావాలి : రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని భారీగా పెంచే దిశగా చేపట్టిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూన్ 2024 నుంచి విద్యుత్ రంగంలో 103 ప్రాజెక్టులకు ఆమోదం

2 లో



రాప్తాడు బాలిక ఓ ఫైటర్



- త్వరలోనే కోలుకుని ఇంటికి వస్తుంది
- పూర్తిగా కోలుకునే వరకు అండగా ఉంటా
- డిశ్చార్జ్‌తో మా బాధ్యత ముగిసిపోదు
- బాలిక ఆరోగ్యంపై వైద్యులతో లోకేష్ సమీక్ష

అమరావతి(జర్నలిస్ట్‌ఫైల్) : ఆ బాలిక ఒక ఫైటర్.. ఎంతో ధైర్యంగా ప్రాణాలతో పోరాడింది. ఇప్పుడు అదే ధైర్యంతో కోలుకుంటోంది. త్వరలోనే ఆరోగ్యంగా ఇంటికి తిరిగి వస్తుంది. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయితే మా బాధ్యత తీరిపోయినట్లు కాదు. తను పూర్తిగా కోలుకుని, మళ్లీ మునుపటిలా నవ్వుతూ, సంతోషంగా సాధారణ జీవితాన్ని గడిపే వరకు తనదే బాధ్యత అని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మిగతా 2లో...

ఫీజులపై వాస్తవాలు వక్రీకరణ

- రీయింబర్స్‌మెంట్‌పై జగన్ తప్పుడు ప్రచారం
- 2024-25 బకాయిలకు రూ.3 వేల కోట్లు విడుదల
- విద్యార్థులను రాజకీయ పావులుగా మార్చొద్దు: లోకేష్

2 లో



మత్స్యకారులను ఆదుకోండి

- అగ్నిప్రమాదంలో వలలు కోల్పోయిన బాధితులకు సాయం
- తక్షణమే నిత్యావసర సరుకులు అందించాలని ఆదేశం
- నష్టంపై సమగ్ర విచారణకు పవన్ సూచన
- పరిహారంతో పాటు కొత్త వలలు అందించేలా చర్యలు

అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్): ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం కె. పల్లెపాలెంలో అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మత్స్యకారులు షెడ్లలో ఉంచిన వలలు దగ్ధమైన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఘటనపై ప్రకాశం జిల్లా కలెక్టర్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులంతా వలలు షెడ్లలో ఉంచుకోగా , అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించినట్టు కలెక్టర్ వివరించారు. మిగతా 3లో...

వాహనదారులూ.. బీమా మర్చిపోవద్దు



- ఇన్సూరెన్స్ లేకుండా రోడ్డెక్కితే ఇబ్బందులే
- టోల్‌ప్లాజాల వద్ద గుర్తించేలా కేంద్రం చర్యలు
- గడువు తీరకముందే బీమా పునరుద్ధరణ
- మంత్రి మండిపల్లి ముందస్తు హెచ్చరిక

అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : వాహనాలకు బీమా లేకుండా రోడ్లపైకి వస్తే జరిమానాలతోపాటు చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. టోల్ ప్లాజాల వద్ద ఇన్సూరెన్స్ లేని వాహనాలను గుర్తించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో వాహనదారులు ముందుగానే అప్రమత్తం కావాలని సూచించారు. మిగతా 3లో...

ఏకగ్రీవమైతే.. అదే రోజు ఉపసర్పంచ్

- సర్పంచ్, వార్డు సభ్యులంతా ఏకగ్రీవమైతే తక్షణ ఎన్నిక
- ముందుగా నిర్ణయించిన తేదీ వరకు వేచి ఉండొద్దు
- రిటర్నింగ్ అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

2 లో

పరిషత్ పాలనకు శ్రీకారం

- 19న ఎంపీపీలు.. 20న జడ్పీ చైర్‌పర్సన్‌ల ఎన్నిక
- కో-ఆప్టెడ్ సభ్యుల ఎంపికకు ప్రత్యేక సమావేశాలు
- తొలి భేటీ తేదీ నుంచే ఐదేళ్ల పదవీకాలం
- నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : రాష్ట్రంలోని మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు సంబంధించి తొలి సమావేశాల నిర్వహణ తేదీలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఖరారు చేసింది. ఈ నెల 19వ తేదీన మండల ప్రజా పరిషత్‌లకు, మిగతా 2లో...

తుపాను ముప్పు.. అప్రమత్తంగా ఉండండి!



- 48 గంటల పాటు యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉండాలి.
- ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- హోంమంత్రి అనిత ఆదేశం

2 లో

అమరావతి, నవంబర్ 18 (జర్నలిస్ట్‌ఫైల్) : బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలపై హోంమంత్రి అనిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

తుపాను ముప్పు.. తస్మాత్ జాగ్రత్త

- రైతులు పంట రక్షణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిపై సమీక్ష..
- ప్రజల భద్రతకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం



కోటబొమ్మాళి నవంబర్ 18 (జర్నలిస్ట్‌ఫైల్) : బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను తీవ్రత ఎక్కువగా ఉండటంతో శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. ఈ నెల 19,20వ తేదీ వరకు తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

తుపాను పరిస్థితులపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి జిల్లాలో పరిస్థితులను సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పునరావాస కేంద్రాలు, కంట్రోల్ రూములను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మిగతా 2లో...

మోస్ట్ వాంటెడ్ మట్టుబెట్టారు



- లష్కరే కమాండర్ లతీఫ్ భట్ హతం
- మసీదులో చుట్టుముట్టిన భద్రతా బలగాలు
- లొంగిపోవాలని కోరినా వెనక్కి తగ్గని ఉగ్రవాది
- 2026లో కీలక విజయమన్న సీఆర్‌పీఎఫ్ డీజీ

శ్రీనగర్ (జర్నలిస్ట్‌ఫైల్) : జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు కీలక విజయాన్ని సాధించాయి. లష్కరే తయ్యిబాకు చెందిన మోస్ట్ వాంటెడ్ కమాండర్ లతీఫ్ భట్‌ను మట్టుబెట్టాయి. ఆ రాష్ట్రంలో ఆ సంస్థకు చెందిన చివరి క్రియాశీల స్థానిక ఉగ్రవాదిగా భావిస్తున్న అతడు.. భద్రతా దళాల నుంచి తప్పించుకునేందుకు ఓ మసీదులో తలదాచుకున్నాడు. అయినప్పటికీ బలగాలు పక్కా వ్యూహంతో అతడిని చుట్టుముట్టాయి. లొంగిపోవాలని వీడియో కాల్ ద్వారా పలుమార్లు విజ్ఞప్తి చేసినా వినిపించుకోక పోవడంతో కాల్పుల్లో హతమార్చాయి. ఈ ఆపరేషన్‌లో మసీదుకు ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. విజయవంతమైన ఆపరేషన్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా



విద్యుత్ వ్యవస్థ రక్షణకు ముందస్తు చర్యలు

- తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు
- అత్యవసర మరమ్మతులకు సిబ్బంది సిద్ధం
- తెలంగాణ నుంచి అదనపు సిబ్బంది కోరిన గొట్టిపాటి

అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : అక్వాన్ తుపాను నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. నెల్లూరు నుంచి విశాఖపట్నం వరకు తీర ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మిగతా 3లో...

రాప్తాడు బాలిక ఓ ఫైటర్



(మొదటి పేజీ తరువాయి)

రాప్తాడులో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిపై మంత్రి లోకేష్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఉండవల్లి నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యులతో మాట్లాడారు. బాలిక ఆరోగ్యంలో వస్తున్న మార్పులు, ప్రస్తుతం అందిస్తున్న చికిత్స, డిశ్చార్జ్ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరంగా తెలుసుకున్నారు. బాలిక వేగంగా కోలుకుంటోందని వైద్యులు చెప్పడంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

మా అమ్మాయి మళ్లీ నవ్వుతోంది.. నడుస్తోంది! : బాలిక ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని మణిపాల్ ఆసుపత్రి వైద్యులు మంత్రి లోకేష్‌కు వివరించారు. ప్రస్తుతం వెంటిలేటర్ అవసరం లేకుండానే శ్వాస తీసుకుంటోందని, ఆక్సిజన్ స్థాయిలు స్థిరంగా ఉన్నాయని తెలిపారు. నోటి ద్వారా ఆహారం తీసుకుంటోందని, ప్రధాన గాయాలు మానిపోయాయని చెప్పారు. కుట్లు తొలగించామని, చిన్నపాటి గాయాలకు చికిత్స కొనసాగుతోందని వివరించారు. బాలిక ఇప్పుడు ఇతరుల సహాయంతో నెమ్మదిగా నడుస్తోందని, గతంతో పోలిస్తే ఎక్కువ అడుగులు వేస్తోందని తెలిపారు. కుడిచేత్తో నీళ్ల గ్లాసు పట్టుకునే స్థాయికి చేరుకుందని, పెన్ను పట్టుకుని రాయడానికి అవసరమైన శిక్షణ కూడా ప్రారంభించామని చెప్పారు. గతంలో జరిగిన విషయాలను గుర్తుచేసుకోగలుగుతోందని వివరించారు. రెండు రోజుల క్రితం నవ్వమని అడిగితే ఆ అమ్మాయి నవ్వింది. ఆ నవ్వు చూసి మాకెంతో సంతోషం కలిగింది. తనలో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. బాలిక నిజంగా ఒక ఫైటర్ అని వైద్యులు చెప్పడంతో మంత్రి లోకేష్ భావోద్వేగానికి లోనయ్యారు.

డిశ్చార్జ్‌తో మా బాధ్యత ముగియదు! : ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. "ఆ అమ్మాయి మన బిడ్డ. తను ఎదుర్కొన్న బాధను మాటల్లో చెప్పలేం. ఇంత చిన్న వయసులో అంతటి బాధను అనుభవించినా ఎంతో ధైర్యంగా పోరాడింది. తనను మళ్లీ మామూలు జీవితంలోకి తీసుకురావడమే మనందరి లక్ష్యం. శారీరక గాయాలు మానిపోయినా, మనసుకు తగిలిన గాయం నుంచి బయటపడటానికి సమయం పడుతుంది. అందుకే తనకు వైద్యంతో పాటు ప్రేమ, ఆప్యాయత, మానసిక ధైర్యం కూడా అందించాలి" అని అన్నారు. తను మళ్లీ స్వేచ్ఛగా నడవాలి. తన చేతులతో రాయాలి. తోటి పిల్లలతో కలిసి సంతోషంగా గడపాలి. తన కలలను నెరవేర్చుకునేలా ఎదగాలి. అందుకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందిస్తాం. తను పూర్తిగా కోలుకునే వరకు తన బాధ్యత నేను తీసుకుంటాను. ఆ కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటాను అని మంత్రి భరోసా ఇచ్చారు.

ఇంటికి వెళ్లాక కూడా బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాలి : బాలిక త్వరలోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే దశకు చేరుకుంటోందని వైద్యులు తెలిపారు. అయితే డిశ్చార్జ్ తర్వాత కూడా పునరావాస చికిత్స, మానసిక మద్దతు, అవసరమైన తదుపరి శస్త్రచికిత్సలు కొనసాగించాల్సి ఉంటుందని వివరించారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. బాలిక ఇంటికి వెళ్లిన తర్వాత కూడా వైద్య సంరక్షణలో ఎలాంటి లోటు ఉండకుండా ఏర్పాట్లు చేస్తామని స్పష్టం చేశారు. స్థానికంగా మానసిక వైద్య నిపుణుడిని అందుబాటులో ఉంచుతామని, అనంతపురం సర్వజన ఆసుపత్రి సహకారంతో పునరావాస చికిత్స కోసం ప్రత్యేక థెరపిస్ట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్థోపెడిక్ చికిత్స, ఫిజియోథెరపీ, భవిష్యత్తులో అవసరమయ్యే శస్త్రచికిత్సలపై మణిపాల్ వైద్యులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఇంటి వద్ద ఎలాంటి ఇన్ఫెక్షన్లు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారాలకు సూచించారు.

ప్రాణాలు కాపాడిన మీ అందరికీ రుణపడి ఉంటాం : బాలిక ప్రాణాలను కాపాడేందుకు కృషి చేసిన మణిపాల్ ఆసుపత్రి వైద్య బృందానికి మంత్రి లోకేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "మీరు కేవలం వైద్యం చేయలేదు. ఒక చిన్నారి ప్రాణాలను కాపాడారు. ఒక కుటుంబంలో మళ్లీ ఆశలు చిగురించేలా చేశారు. ఆ బిడ్డ మళ్లీ నవ్వుతోందంటే మీ అందరి కృషే కారణం. మీ సేవలను ఎప్పటికీ మర్చిపోలేం" అని వైద్యులను అభినందించారు. అనంతపురంలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. బృందంలోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక డాక్టర్ బాలికతో తెలుగులో మాట్లాడుతూ ఆమెకు, తల్లిదండ్రులకు ధైర్యం కల్పిస్తున్నారని వైద్యులు తెలిపారు. బాలిక కోలుకుంటున్న తీరు పట్ల తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారని, మొదటి నుంచీ శ్రద్ధ తీసుకుంటున్న మంత్రి లోకేష్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారని వివరించారు.

విద్యుత్ డిమాండ్‌కు దీటుగా ప్రణాళిక



(మొదటి పేజీ తరువాయి)

తెలిపామని, వీటి ద్వారా రూ. 4. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో విద్యుత్ రంగానికి సంబంధించి రూ. 2. 56 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు జరిగినట్లు తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణతో పాటు ఒప్పందాలు కార్యరూపం దాల్చడంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఎంఓయూలు చేసుకున్న ప్రతి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా నిర్దిష్ట కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 కింద రాష్ట్రంలో రూ. 21,838 కోట్లతో భారీ విద్యుత్ సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు వివరించారు. ఈ కారిడార్ ద్వారా 47 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సరఫరా సామర్థ్యానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి త్వరగా టెండర్లు పిలిచి, రెండేళ్లలోగా కార్యరూపంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

36,050 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ లక్ష్యం : రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 36,050 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. పోలవరం పరిసర ప్రాంతాల్లో 27 పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అనువైన ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై మరింత పరిశోధన, అధ్యయనం జరగాలని సీఎం సూచించారు. పీఎం సూర్య ఘర్ పథకం అమలులో ప్రస్తుతం దేశంలో నాలుగో స్థానంలో ఉన్న మన రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తీసుకువెళ్లాలని సీఎం నిర్దేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో పాటు... సాగునీటి ప్రాజెక్టులు, కాలువ గట్లపై సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పాల్సి ఉందన్నారు. సోలార్ రూఫ్ టాప్‌లో నాయుడుపేట, మాచర్ల, నరసరావుపేట డివిజన్లు ముందున్నాయని అధికారులు తెలిపారు. అలాగే ఇప్పటి వరకు 7.42 లక్షల రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్లు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొనగా, 10 లక్షల లక్ష్యాన్ని డిసెంబర్ నాటికి చేరుకోవాలని సీఎం స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ పథకం కింద 224 ప్రాంతాల్లో 1,162 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల పనుల్లో పురోగతి ఉందని అధికారులు వివరించారు. పీఎం కుసుమ్ ప్రాజెక్టుల కోసం భూసేకరణ 100 శాతం పూర్తి చేశామని, అలాగే సివిల్ పనులు 91 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

ఏకగ్రీవమైతే.. అదే రోజు ఉపసర్పంచ్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు జరుగుతున్న రెండవ సాధారణ ఎన్నికలు--2026 లో భాగంగా, సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీల్లో ఉపసర్పంచ్ ఎన్నికను అదే రోజు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు రిటర్నింగ్ అధికారులకు తగిన సూచనలు జారీ చేయాలని అన్ని జిల్లాల పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా ఆదేశాలు జారీ చేశారు.

ఈ అంశంపై కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి కోరిన వివరణకు స్పందిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ స్పష్టత ఇచ్చింది.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం రిటర్నింగ్ అధికారి జారీ చేసే ఎన్నికల నోటీసుతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆ నోటీసులో ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించే ప్రదేశం, తేదీ, సమయాన్ని కూడా పేర్కొంటారని కమిషనర్ తెలిపారు. అయితే నామినేషన్ల ఉపసంహరణకు నిర్దేశించిన గడువు ముగిసిన తర్వాత మాత్రమే గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారా లేదా అన్న విషయం స్పష్టమవుతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన రిటర్నింగ్ అధికారుల హ్యాండ్‌బుక్‌లోని అధ్యాయం-IXలో కూడా దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనప్పుడు, హ్యాండ్‌బుక్‌లోని అధ్యాయం-XVIIలో సూచించిన విధానాన్ని అనుసరించి రిటర్నింగ్ అధికారి (స్టేజ్-I) ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని ఆదేశించినట్లు వివరించారు.

గ్రామ పంచాయతీకి సంబంధించిన మొత్తం పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంలో, ఉపసర్పంచ్ ఎన్నిక కోసం ముందుగా నిర్ణయించిన తేదీ వరకు వేచి ఉండకుండా, ఎన్నికల ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఈ మార్గదర్శకాలను జారీ చేసినట్లు ఎన్నికల కమిషనర్ తెలిపారు.

1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(10) ప్రకారం గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని నిబంధన ఉందని కమిషనర్ గుర్తుచేశారు. అలాగే 2006 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికల నిర్వహణ) నిబంధనల్లోని రూల్ 3(1) కూడా ఇదే విషయాన్ని నిర్దేశిస్తోందని తెలిపారు.

కాబట్టి, సర్పంచ్ మరియు వార్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీల్లో ఏకగ్రీవ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే అదే రోజున ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించేలా రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా స్పష్టం చేశారు.

మోస్ట్ వాంటెడ్ మట్టుబెట్టారు

(మొదటి పేజీ తరువాయి)

భద్రతా దళాలను అభినందించారు.

సోమవారం కుల్గాం జిల్లా లారూ ప్రాంతంలో భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో లతీఫ్ భట్ బుల్లెట్ గాయాలతో తప్పించుకున్నట్లు సమాచారం. అదే ఆపరేషన్‌లో మరో ఉగ్రవాది ఉమర్ నాసిర్ దార్ హతమయ్యాడు. దీంతో లతీఫ్ కోసం బలగాలు గాలింపును ముమ్మరం చేశాయి. సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున అతడి ఆచూకీ గుర్తించి చుట్టుముట్టాయి.

ఈ సందర్భంగా లతీఫ్‌ను లొంగిపోయేలా చేసేందుకు అధికారులు ప్రయత్నించారు. వీడియో కాల్ ద్వారా అతడితో మాట్లాడి ఆయుధాలు విడిచిపెట్టి బయటకు రావాలని సూచించారు. లొంగిపోతే ఎలాంటి హాని జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే అతడు అందుకు నిరాకరించడంతో భద్రతా దళాలు కాల్పులు జరిపి హతమార్చాయి.

ఆపరేషన్‌పై అమిత్ షా ప్రశంసలు : లతీఫ్ భట్ హతమైన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా భద్రతా దళాలను అభినందించారు. జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, నిఘా సంస్థలు సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించాయని ప్రశంసించారు. దేశం తరఫున ధైర్యవంతులైన జవాన్లకు వందనాలు తెలుపుతున్నట్లు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జి.పి.సింగ్ కూడా ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందిని అభినందించారు. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయని, 2026లో ఇది అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలవనుందని పేర్కొన్నారు.



దాడికి ముందు రెక్కీ : నవంబరు 11న కుల్గాంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై దాడికి ముందు లతీఫ్ భట్ పలు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు సీసీటీవీ దృశ్యాల ద్వారా వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. నవంబరు 10న మీర్ బజార్, అఖ్రూన్ హబ్లిష్, కిలామ్ ప్రాంతాల్లో అతడు సంచరించినట్లు గుర్తించారు. గతంలోనూ పలు కీలక ఉగ్రవాద దాడుల్లో పాల్గొన్నట్లు భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. అతడి ఆచూకీ తెలిపి పట్టుకోవడంలో సహకరించిన వారికి రూ. 15 లక్షల నజరానా ప్రకటించారు.

జలంగం పహ్లూలో మళ్లీ కాల్పులు : కుల్గాం జిల్లాలోని జలంగం పహ్లూ ప్రాంతంలో బుధవారం మరోసారి భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఉగ్రవాదులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో భద్రతా దళాలు సంయుక్తంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులతో ఎదురుపడటంతో కాల్పులు ప్రారంభమయ్యాయి. ఆపరేషన్ కొనసాగుతోందని కశ్మీర్ జోన్ పోలీసులు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఘర్షణకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లారూలో నవంబరు 16న ఎదురుకాల్పులు : కుల్గాం జిల్లా లారూ ప్రాంతంలో నవంబరు 16న కూడా భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఓ ఉగ్రవాది మృతదేహంతో పాటు ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పరిసర ప్రాంతాలను దిగ్బంధించి అదనపు బలగాలను మోహరించారు. మరికొందరు ఉగ్రవాదులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

తుపాను ముప్పు.. తస్మాత్ జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

రైతులు పంటల విషయంలో అప్రమత్తంగా ఉండాలి : భారీ వర్షాల సూచనల నేపథ్యంలో రైతులు ప్రస్తుతం చేపడుతున్న వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వరి కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యాన్ని కుప్పలుగా చేర్చి, వర్షపు నీరు చేరకుండా, పంట తడవకుండా టార్పాలిన్లు, ఇతర కవర్లతో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు జారీ చేసే హెచ్చరికలను గమనిస్తూ వ్యవసాయ పనుల విషయంలో తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.



అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా తగిన హెచ్చరికలు జారీ చేయాలని, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్, , విద్యుత్, వైద్య ఆరోగ్య, తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. రహదారులపై చెట్లు కూలినప్పుడు వెంటనే తొలగించేలా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, మందులు వంటి నిత్యావసరాలను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుపాను సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతులు కూడా పంటల రక్షణకు ప్రాధాన్యమిస్తూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

ఫీజులపై వాస్తవాలు వక్రీకరణ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాస్తవాలను వక్రీకరిస్తూ తప్పుదు ప్రచారం చేస్తున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విమర్శించారు. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని జగన్‌కు ఆర్థిక సంవత్సరం, విద్యా సంవత్సరం మధ్య వ్యత్యాసం కూడా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఏ త్రైమాసికంలో విడుదలయ్యాయన్నది, అవి ఏ విద్యా సంవత్సరానికి సంబంధించిన బకాయిల కోసం చెల్లించారన్నది వేర్వేరు అంశాలని స్పష్టం చేశారు.

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం సుమారు రూ. 3,000 కోట్లు విడుదల చేసినట్లు అసెంబ్లీలో వెల్లడించామని, ఆ ప్రకటనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఏ త్రైమాసికంలో ఎంత మొత్తం విడుదల చేశారన్న పూర్తి వివరాలను పట్టిక రూపంలో స్పష్టంగా వెల్లడించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాలు, సవరించిన కేటాయింపులు, వాస్తవ చెల్లింపుల మధ్య వ్యత్యాసం ఉంటుందని, నిధుల విడుదలకు అనుగుణంగా బడ్జెట్‌లో సర్దుబాట్లు జరుగుతాయని వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం జరిగేదని, ప్రభుత్వం నుంచి నిధులు అందకముందే విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలలకు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఉండేదని లోకేష్ విమర్శించారు. తమ ప్రభుత్వం ఆ పరిస్థితిని మార్చి విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా నేరుగా కళాశాలలకే నిధులు చెల్లించే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రతి నెలా రూ. 200 నుంచి రూ. 300 కోట్ల చొప్పున బకాయిలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని వెల్లడించారు.

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ వీలైనంత త్వరగా చెల్లించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని, రాజకీయ స్వార్థం కోసం విద్యార్థులను పావులుగా ఉపయోగించుకోవడం మానుకోవాలని జగన్‌కు హితవు పలికారు.

పరిషత్ పాలనకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

20వ తేదీన జిల్లా ప్రజా పరిషత్‌లకు తొలి సమావేశాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా తెలిపారు.

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల రెండో సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తిచేసి ఫలితాలను ప్రకటించినట్లు తెలిపారు. అనంతరం మండల పరిషత్‌ల కో-ఆప్టెడ్ సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నిక కోసం నవంబర్ 19న, జిల్లా పరిషత్‌ల కో-ఆప్టెడ్ సభ్యులు, చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌ల ఎన్నిక కోసం నవంబర్ 20న ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేసినట్లు ఎన్నికల కమిషనర్ పేర్కొన్నారు.

1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్లు 153(3), 181(4) ప్రకారం సాధారణ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం ఎన్నికైన సభ్యులతో మండల, జిల్లా పరిషత్‌ల తొలి సమావేశాలు నిర్వహించి అధ్యక్ష, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌ల ఎన్నిక చేపట్టాల్సి ఉంటుందని వివరించారు.

అదేవిధంగా, ఈ చట్టంలోని సెక్షన్లు 153(5), 154(ii), 181(6), 182(ii) ప్రకారం మండల, జిల్లా పరిషత్‌ల ఎన్నికైన సభ్యులు, కో-ఆప్టెడ్ సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్‌లు, వైస్‌చైర్‌పర్సన్‌ల ఐదేళ్ల పదవీకాలం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్ణయించిన తొలి సమావేశం తేదీ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243Kతో పాటు 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ నవంబర్ 19, 2026ను మండల ప్రజా పరిషత్‌ల తొలి సమావేశ తేదీగా, నవంబర్ 20, 2026ను జిల్లా ప్రజా పరిషత్‌ల తొలి సమావేశ తేదీగా నిర్ణయిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా వెల్లడించారు.

ఈ తేదీల నుంచే సంబంధిత మండల, జిల్లా పరిషత్‌ల ప్రజాప్రతినిధుల ఐదేళ్ల పదవీకాలం ప్రారంభమవుతుందని

నిర్వహించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా స్పష్టం చేశారు.

తుపాను ముప్పు.. అప్రమత్తంగా ఉండండి!

(మొదటి పేజీ తరువాయి)

రానున్న 48 గంటల పాటు రాష్ట్రంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని ఆమె ఆదేశించారు. తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అక్వాన్ తుపాను మందగమనంతో గంటకు కేవలం 8 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు అధికారులు హోంమంత్రికి వివరించారు. ఎల్లుండి మధ్యాహ్నానికి శ్రీకాకుళం- దక్షిణ ఒడిశా ప్రాంతాల్లో తీరాన్ని దాటే అవకాశం ఉందని, తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అంచనా వేశారు. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. తుపాను అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 13 జాతీయ విపత్తు స్పందన దళాలు, 11 రాష్ట్ర విపత్తు స్పందన దళాలతో పాటు స్థానిక అగ్నిమాపక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో సహాయక బృందాలను తక్షణమే రంగంలోకి దింపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నియంత్రణ కేంద్రాలు నిరంతరం 24 గంటల పాటు పనిచేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సహాయం కోరే సమాచారంపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. తీర ప్రాంత ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని హోంమంత్రి సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అధికారులు సూచించిన వెంటనే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. వర్షాలు, బలమైన ఈదురుగాలుల నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొలాల్లో పనిచేసే సమయంలో వాతావరణ పరిస్థితులను గమనిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం, చెట్లు కూలిపోవడం, రహదారులపై నీరు నిలవడం వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే



అధికారులకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయినా, విద్యుత్ తీగలు తెగిపడినా వాటి సమీపానికి వెళ్లరాదని హెచ్చరించారు. ప్రజలు అధికారికంగా జారీ చేసే వాతావరణ హెచ్చరికలను మాత్రమే విశ్వసించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే నిర్ధారణలేని వార్తలు, వదంతులను నమ్మవద్దని స్పష్టం చేశారు.

అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం 112, 1070, 18004250101 నంబర్లను సంప్రదించాలని హోంమంత్రి సూచించారు. విద్యుత్ అంతరాయం, చెట్లు కూలడం, నీటి నిల్వలు, ఇతర సమస్యలపై 'మన మిత్ర' వాట్సాప్ నంబరు 9552300009కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన ప్రతి సందర్భంలో స్థానిక అధికారులను సంప్రదించాలని హోంమంత్రి అనిత విజ్ఞప్తి చేశారు. తుప

తెనాలిలో మరింత సమన్వయం దిశగా కూటమి పార్టీలు !

మరింత బలపడనున్న టీడీపీ-జనసేన-బీజేపీ బంధం









తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) : ఇటీవల వెలువడిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల ఫలితాల సమీక్ష అనంతరం తెనాలి నియోజకవర్గంలో కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య మరింత సమన్వయం, పరస్పర సహకారం పెంపొందించుకునే దిశగా కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు జనసేన అభ్యర్థులకు సంపూర్ణంగా సహకరించినప్పటికీ, ఆశించిన స్థాయిలో మెజార్టీ రాకపోవడం, కొల్లిపర జడ్పీటీసీ స్థానాన్ని వైసీపీకి కోల్పోవడం కూటమి వర్గాల్లో అంతర్గత సమీక్షకు కారణమైంది. ముఖ్యంగా జనసేన శ్రేణుల్లో ఈ ఫలితాలపై లోతైన విశ్లేషణ సాగుతోంది. క్షేత్రస్థాయిలో జనసేన నేతలు టీడీపీ శ్రేణులను సమన్వయం చేసుకుని ఉంటే ఫలితాలు భిన్నంగా ఉండేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తెనాలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచీ బలమైన కేడర్ ఉంది. ప్రతి వార్డు, ప్రతి గ్రామం, వీధి స్థాయి వరకు పార్టీ కార్యకర్తల నెట్‌వర్క్ విస్తరించి ఉంది. 2014 నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నాయకత్వంలో టీడీపీ నియోజకవర్గంలో తన పట్టును నిలబెట్టుకుంటూ వచ్చింది. పార్టీ కార్యకర్తలతోనే కాకుండా, వారి కుటుంబాలతోనూ వ్యక్తిగత సంబంధాలు కొనసాగిస్తూ, అవసరమైన సందర్భాల్లో ఆర్థికంగా అండగా నిలుస్తూ పార్టీని బలోపేతం చేశారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ప్రభంజనం వీచి తెనాలిలోనూ ఆ పార్టీ విజయం సాధించినప్పటికీ, 2019-2024 మధ్య తీవ్ర రాజకీయ ఒత్తిళ్లు ఎదురైన సమయంలోనూ, 2024 తర్వాత నెలకున్న పరిస్థితుల్లోనూ టీడీపీ కేడర్‌ను చెక్కుచెదరకుండా కాపాడుకోవడంలో ఆలపాటి కీలక పాత్ర పోషించారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది.

2019-2024 మధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగినప్పటికీ, 2024 తర్వాత తెనాలిలో భిన్నమైన పరిస్థితులు నెలకున్నప్పటికీ తెనాలి నియోజకవర్గంలో పార్టీకి చెందిన గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు పార్టీని వీడకుండా నిలబడటం ఆలపాటి రాజేంద్రప్రసాద్ నాయకత్వానికి నిదర్శనంగా టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. కార్యకర్తలకు అండగా నిలవడం, వారితో నిరంతరం సంబంధాలు కొనసాగించడం ద్వారా పార్టీ పునాదులను బలంగా ఉంచగలిగారని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

2024 సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులో భాగంగా తెనాలి అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించినప్పటికీ, టీడీపీ శ్రేణుల్లో ఉన్న అసంతృప్తిని పక్కనపెట్టి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూటమి అభ్యర్థి విజయం కోసం కృషి చేశారు. టీడీపీ ఓట్లు జనసేనకు బదిలీ అయ్యేలా పార్టీ శ్రేణులను సమన్వయపరిచారు. ఎన్నికల అనంతరం కూడా ఎమ్మెల్సీగా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా తనకు ఎదురైన ప్రోటోకాల్ సంబంధిత అసౌకర్యాలపై బహిరంగ అసంతృప్తి వ్యక్తం చేయకుండా పార్టీ కేడర్‌ను కూటమి విజయాల దిశగా నడిపించారనే ప్రశంసలు వినిపిస్తున్నాయి.

ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లోనూ ఇంటింటికీ విస్తృతంగా పర్యటించిన కూటమి అగ్రనేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఒక్కరే. ప్రతి వార్డు, ప్రతి గ్రామం, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం నిర్వహించడంతోపాటు టీడీపీ కార్యకర్తలందరినీ ఎన్నికల క్షేత్రంలోకి తీసుకువచ్చారు. రాత్రింబవళ్లు ప్రచారంలో పాల్గొంటూ జనసేన అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. వాస్తవానికి జనసేన నాయకుల కంటే ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎక్కువగా శ్రమించారనే వ్యాఖ్యలు కూటమి వర్గాల్లో వినిపిస్తున్నాయి. గెలుపొందిన కూటమి అభ్యర్థులు సైతం ఆయనను కలిసి తమ విజయానికి చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ శ్రేణుల్లో అసంతృప్తిని అణిచి ఉంచుతూ, మరోసారి జనసేనకు సంపూర్ణంగా ఓట్లు బదిలీ అయ్యేలా చేసిన ఆయన రాజకీయ హుందాతనం, సమన్వయ సామర్థ్యంపై కూటమి నేతలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో తోటకూర వెంకట రమణారావును జనసేన చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేయడంలో మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారనే ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. కాపు సామాజికవర్గానికి చెందిన ఆయనకు అవకాశం కల్పించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో జనసేన చైర్మన్ అభ్యర్థి 17,093 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 52 కౌన్సిలర్ స్థానాల్లో టీడీపీ 31 స్థానాల్లో పోటీ చేసి 29 స్థానాలను గెలుచుకోగా, జనసేన 20 స్థానాల్లో పోటీ చేసి 16 స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ ఒక స్థానంలో పోటీ చేసి విజయం సాధించింది. ఈ ఫలితాలు మున్సిపాలిటీలో కూటమి బలాన్ని చాటినప్పటికీ, గత ఎన్నికలతో పోలిస్తే మెజార్టీ తగ్గడం మాత్రం చర్చనీయాంశమైంది.

ఇక జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే తెనాలి మండలంలో టీడీపీ అభ్యర్థి సుమారు 16 వేల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. అయితే కొల్లిపర మండలంలో జనసేన అభ్యర్థి కేవలం 160 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. దీంతో ఆ స్థానాన్ని వైసీపీ కైవసం చేసుకుంది. ఈ ఓటమి వెనుక ప్రధానంగా జనసేన స్థానిక నేతలు టీడీపీ శ్రేణులతో క్షేత్రస్థాయి సమన్వయం చేసుకోకపోవడమే అనే అభిప్రాయం జనసేన వర్గాల్లో వ్యక్తమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో జనసేన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు టీడీపీ స్థానిక నేతలతో సరైన సమన్వయం చేసుకోలేకపోయారని, వారి సూచనలు, ఎన్నికల వ్యూహాలను పరిగణనలోకి తీసుకోకపోవడం వల్లే స్వల్ప ఓట్ల తేడాతో విజయం చేజారిందనే విశ్లేషణ సాగుతోంది.

కొల్లిపర మండలంలో జనసేన నేతల తీరుపై సొంత పార్టీలోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఏ నేతను చూసి స్ఫూర్తి పొందారో తెలియదు కానీ, కొల్లిపర మండలంలో కొందరు జనసేన నాయకులు టీడీపీ శ్రేణులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి వాళ్ల గొయ్యిని వాళ్లే తవ్వుకున్నారనే అభిప్రాయం జనసేన వర్గాల్లోనే వ్యక్తమవుతోంది. కూటమి అభ్యర్థి విజయానికి కీలకంగా నిలవాల్సిన టీడీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకోకపోగా, వారి సూచనలు, సలహాలను సైతం పక్కనపెట్టడం వల్లే పార్టీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందనే విశ్లేషణ సాగుతోంది.

ఇక మంత్రి నాదెండ్ల మనోహర్ టీడీపీ శ్రేణులపై చూపించే ఆప్యాయత, ప్రేమాభిమానాలు వర్ణనాతీతం. ఆయన వైఖరి, వ్యవహారశైలికి సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్న టీడీపీ కార్యకర్తలు, మంత్రిగారి విశిష్టత గురించి చెప్పుకోకుండా ఉండలేక సరికొత్త కీర్తనలతో అనునిత్యం స్తుతిస్తూనే ఉంటారు. మంత్రి మనోహర్‌పై టీడీపీ శ్రేణులు చేసే కీర్తనలను స్వయంగా విన్నవారికే ఆయన పొత్తు ధర్మానికి ఎంతటి విలువ ఇస్తారో, తమ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఎన్నికలోనూ కష్టపడుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తల పట్ల ఎంతటి గౌరవాభిమానాలు ప్రదర్శిస్తారో, ఎంత హుందాగా వ్యవహరిస్తారో అర్థమవుతుంది. జనసేన అభ్యర్థుల గెలుపు కోసం టీడీపీ శ్రేణులు చేస్తున్న కృషిని గుర్తిస్తూ, వారిని గౌరవిస్తూ, సమన్వయంతో ముందుకు సాగడంలో మంత్రి మనోహర్ చూపిస్తున్న విశిష్టత తాము కలలో కూడా ఊహించనిదని టీడీపీ వర్గాలు కీర్తిస్తున్నాయి.

అయితే అగ్రస్థాయిలో మంత్రి మనోహర్ స్వయంగా పాటిస్తున్న పొత్తు ధర్మాన్ని క్షేత్రస్థాయిలో కొందరు జనసేన నాయకులు విస్మరించడం, జనసేన గెలుపు కోసం నిబద్ధతతో పనిచేస్తున్న టీడీపీ శ్రేణులను సమన్వయపరచుకోకపోవడం, వారి సూచనలు, వ్యూహాలను నిర్లక్ష్యం చేయడం వల్ల కలిగే నష్టానికి కొల్లిపర జడ్పీటీసీ అభ్యర్థి ఓటమి నిలువెత్తు నిదర్శనమనే అభిప్రాయం జనసేన వర్గాల్లోనే వ్యక్తమవుతోంది. మంత్రి మనోహర్ వ్యవహారశైలిని స్ఫూర్తిగా తీసుకుని జనసేన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు కూడా టీడీపీ నేతలు, కార్యకర్తల పట్ల అదే గౌరవం, స్నేహభావం ప్రదర్శించి ఉంటే కొల్లిపర ఫలితం మరోలా ఉండేదనే విశ్లేషణ సాగుతోంది. ఈ పరిణామాల నుంచి గుణపాఠం నేర్చుకుని వ్యక్తిగత ఆధిపత్యాలు, బేషజాలకు తావివ్వకుండా టీడీపీ శ్రేణులను కలుపుకొని ముందుకు సాగాలని జనసేనలోని పలువురు నాయకులు సూచిస్తున్నట్లు సమాచారం.

మరోవైపు తెనాలి నియోజకవర్గంలో రెడ్డి సామాజికవర్గం మద్దతు కూడా గతంతో పోలిస్తే కొంత తగ్గిందనే విశ్లేషణ వినిపిస్తోంది. గతంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు రెడ్డి సామాజికవర్గంతో సన్నిహిత సంబంధాలు ఉండేవని, సీట్లు, పదవుల కేటాయింపులోనూ ఆ వర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించేవారని పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. అయితే ఇటీవలి కాలంలో ఆ సామాజికవర్గాన్ని తగిన స్థాయిలో కలుపుకుపోలేకపోయారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొల్లిపర జడ్పీటీసీ ఎన్నికలో ఈ పరిణామం కూడా ప్రభావం చూపి ఉండవచ్చనే అంచనాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే తెనాలి ఎన్నికల ఫలితాలు కూటమి బలాన్ని మాత్రమే కాకుండా, భవిష్యత్తులో అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాన్ని కూడా సూచిస్తున్నాయి. టీడీపీకి ఉన్న బలమైన కేడర్, జనసేనకు ఉన్న నాయకత్వ బలం, బీజేపీ భాగస్వామ్యం సమష్టిగా పనిచేస్తే కూటమికి మరింత మెరుగైన ఫలితాలు సాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అగ్రనేతల మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలు క్షేత్రస్థాయిలోనూ కొనసాగడం, ప్రతి సామాజికవర్గాన్ని కలుపుకుపోవడం, స్థానిక నాయకుల సూచనలకు ప్రాధాన్యం ఇవ్వడం అత్యవసరమని తాజా ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. కొల్లిపర ఫలితం కూటమికి ఒక హెచ్చరికగా మారిందా? లేక భవిష్యత్తులో మరింత సమన్వయానికి పునాదిగా నిలుస్తుందా? రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఈ ప్రభావం ఏ మేరకు ఉంటుంది అన్నది రాబోయే రాజకీయ పరిణామాలే తేల్చనున్నాయి.





మత్స్యకారులను ఆదుకోండి

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 250 నుంచి 300 వరకు వలలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఉప ముఖ్యమంత్రివర్యులు దిశా నిర్దేశం చేశారు. తుపాను కారణంగా వేట విరామం ఉండడం, వలలు కాలిపోవడంతో మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా బాధిత కుటుంబాలకు తక్షణమే నిత్యావసర సరుకులు అందజేయాలని కలెక్టర్ ను ఆదేశించారు. నష్టపరిహారం అందించాలని, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన 2.ా పథకం కింద నష్టపోయిన వలలను తిరిగి అందించే ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వలలు నష్టపోయిన మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు.

వాహనదారులూ.. బీమా మర్చిపోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి వాహనానికి చెల్లుబాటయ్యే థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉండటం తప్పనిసరి అని మంత్రి స్పష్టం చేశారు. బీమా గడువు ముగిసిన తర్వాత నిర్లక్ష్యం చేయకుండా, గడువు ముగియకముందే రెన్యువల్ చేసుకోవాలని కోరారు. ఇన్సూరెన్స్ లేని వాహనాలను గుర్తించి చర్యలు తీసుకునే విధానానికి అనుగుణంగా వాహనదారులు తమ పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు ఆర్థిక భద్రత కల్పించడం, బాధ్యతాయుతమైన వాహన వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ విధానం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో తీసుకొస్తున్న నూతన విధానానికి సహకరిస్తూ రవాణా శాఖ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

నేడు ఎంపీపీగా పూజ ఉమాదేవి ప్రమాణ స్వీకారం.



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారిమఠం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు(ఎంపీపీ) గా ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మంగారి మఠం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి మండల పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని పూజ శివ యాదవ్ పిలుపునిచ్చారు.

తీవ్ర తుపానుగా బలపడిన 'అక్వాన్'

అమరావతి, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): నెమ్మదిగా కదులుతున్న అక్వాన్ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడింది. గడిచిన 6 గంటల్లో గంటకు 3 కిలోమీటర్ల వేగంతో కదులుతుంది. చెన్నైకి 580, మచిలీపట్నానికి 610, విశాఖకు 610, ఒడిశా గోపాల్‌పూర్‌కు 740 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. ఎల్లుండి మధ్యాహ్నానికి కాకినాడ-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉంది. రేపు సాయంత్రానికి అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది. తీవ్రతుపాను తీరం దాటే సమయంలో 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు.

తుపాను గమనంపై ఆర్టీజీఎస్-విపత్తుల సంస్థ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. తుపాను గమనంపై ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగాలకు సూచనలు చేస్తున్నారు. అత్యవసర



సహాయక చర్యలకు 13 ఎన్డీఆర్?ఎఫ్?, 11 ఎస్డీఆర్?ఎఫ్? బృందాలు, అగ్నిమాపక బృందాలను సిద్ధం చేశారు. తీర ప్రాంత ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. రైతులు వ్యవసాయ పనుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కోస్తాంధ్ర జిల్లాల్లో రేపు, ఎల్లుండి కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. 19, 20 తేదీల్లో కొన్ని చోట్ల 21 సెంటిమీటర్లకు మించి వర్షం కురుస్తుందని రాయలసీమలోని అనేక ప్రాంతాల్లో భారీవర్షాలు పడుతాయని వెల్లడించింది. కాకినాడ సమీపంలో తుపాను తీరం దాటుతుందని వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అక్వాన్ ప్రభావంతో కాకినాడ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. తుపాను హెచ్చరికలతో కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో చెరువులు, రిజర్వాయర్లు, డ్రైనేజీల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన చోట సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

మైదుకూరు అమ్మవారిశాలలో వైభవంగా గౌరమ్మ పూజలు ప్రారంభం

- **మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గౌరమ్మకు ఘన స్వాగతం**

మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్):కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మైదుకూరు పట్టణంలోని అమ్మవారిశాలలో గౌరమ్మ పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా గౌరమ్మను ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

కార్యక్రమంలో భాగంగా తొలుత అమ్మవారిశాల నుంచి మహిళలు, ఆర్యవైశ్య సభ యువజన సంఘం మహిళా మండలి సభ్యులు, ప్రదర్శనగా మైదుకూరులోని శివసాయి మందిరానికి చేరుకున్నారు. అనంతరం అక్కడి నుంచి గౌరమ్మను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తుల కోలాహలం మధ్య ఊరేగింపుగా అమ్మవారిశాలకు తీసుకొచ్చారు.



అనంతరం అమ్మవారిశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి గౌరమ్మను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. కార్తీక మాసం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ గౌరమ్మ పూజా కార్యక్రమాలు ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా కొనసాగనున్నాయి. ఈ ఐదు రోజుల పాటు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించ నున్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బల్లాని చెన్నకేశవ ప్రసాద్ జూటూరు బాల వీరయ్య యెలిశెట్టి గురు ప్రసాద్ నూకల సత్యనారాయణ కరమలపుటి సుబ్బరాయుడు పుట్టా సాయి మాలేపాటి అభిరామ్ చిలంకూరు మారుతి కుమార్ శంకూరి వెంకటరమణ ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బల్లాని సునంద కమిటీ వారు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిశాల ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

కువైట్‌లో చిక్కుకున్న తెలుగు వాసికి మంత్రి సత్యకుమార్ అండ

అమరావతి, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): కువైట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నమయ్య జిల్లా వాయల్పాడుకు చెందిన బండి రెడ్డి కిరణ్‌ను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. యజమాని, ఏజెంట్ పరంగా ఇబ్బందుల్లో పడ్డ కార్మికుడు కిరణ్‌కు అవసరమైన సహాయం అందించి, ఆయనను భారతదేశానికి రప్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్‌కు లేఖ రాశారు. కువైట్‌లో తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ కిరణ్ కుటుంబ సభ్యులు మంత్రి కార్యాలయాన్ని సంప్రదించి సహాయం కోరారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టారు. భారత రాయబార కార్యాలయం ద్వారా జోక్యం చేసుకుని కిరణ్‌కు అవసరమైన సహాయం అందించాలని, ఆయనను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రిని కోరారు.

విద్యుత్ వ్యవస్థ రక్షణకు ముందస్తు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

తుపాను ప్రభావంతో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున, విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ మేరకు మూడు డిస్కంల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. తుపాను తీవ్రత దృష్ట్యా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. అదనపు సిబ్బంది అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు వెల్లడించారు.


అర్నాబ్, మురసు తుపానుల సమయంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అక్వాన్ తుపాను సహాయక చర్యలకు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయినా, సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేసి, ఫిర్యాదులను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. శాఖాపరమైన నిర్లక్ష్యం కారణంగా ఎలాంటి నష్టం జరగడానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా విద్యుత్ సిబ్బంది పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేసినా, తుపాను కారణంగా అంతరాయం ఏర్పడినా వినియోగదారులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు.



బడుల వద్ద చెత్త కుప్పలా?

విద్యార్థినుల ఆవేదనకు మంత్రి లోకేశ్ స్పందన..

విద్యాసంస్థల పరిసరాల పరిశుభ్రతపై పాలకుల ప్రత్యేక దృష్టి అవసరం



విద్యాలయాలు విజ్ఞానాన్ని అందించే దేవాలయాలు. రేపటి సమాజానికి అవసరమైన పౌరులను తీర్చిదిద్దే పవిత్ర ప్రదేశాలు. అలాంటి పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంతో పాటు స్థానిక సమాజంపైనా ఉంది. కానీ కొన్ని ప్రాంతాల్లో అధికారుల నిర్లక్ష్యం, స్థానిక సంస్థల అలసత్వం, ప్రజల్లో పౌర బాధ్యత కొరవడటంతో విద్యాసంస్థల పరిసరాలే అపరిశుభ్రతకు నిలయాలవుతున్నాయి. తిరుపతి జిల్లా రైల్వేకోడూరులోని బాలికల పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్త ఇందుకు నిదర్శనం.

పాఠశాల పక్కనే పెద్దఎత్తున చెత్త పేరుకుపోవడం, దుర్వాసన కారణంగా తరగతి గదుల్లో పాఠాలు వినలేకపోతున్నామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేయడం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేయాలి. ముక్కు మూసుకుని తరగతులకు హాజరవుతున్నామని వారు వెల్లడించిన సమస్య సామాన్యమైనది కాదు. విద్యార్థులకు కనీస పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించలేని పరిస్థితి నెలకొంటే విద్యా వ్యవస్థలో మౌలిక సదుపాయాల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తక తప్పదు. విద్యార్థినుల ఆవేదనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వెలుగులోకి రావడంతో ఈ సమస్య రాష్ట్రస్థాయి దృష్టిని ఆకర్షించింది.

సమస్యపై తక్షణ స్పందన: ఈ అంశంపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించడం గమనార్హం. పాఠశాల వద్ద చెత్త పేరుకుపోవడం వల్ల చిన్నారులు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు తనను కలచివేశాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు తరగతి గదుల్లోనే కాకుండా పాఠశాలకు వచ్చే మార్గంలోనూ పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం ఉండాలని అభిప్రాయపడ్డారు. సమస్యను తక్షణమే పరిష్కరించి చెత్తను తొలగించాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను కోరారు. మరోసారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా స్థానిక ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన పెంచాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం మంచి పరిణామం. అయితే స్పందనతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినప్పుడే ప్రభుత్వ చొరవకు సార్థకత చేకూరుతుంది.


పారిశుద్ధ్యం అధికారుల బాధ్యత మాత్రమే కాదు : పాఠశాలల పరిసరాల్లో చెత్త పేరుకుపోవడానికి స్థానిక సంస్థల నిర్లక్ష్యం ఒక కారణమైతే, ప్రజల్లో పౌర బాధ్యత లోపించడం మరో ప్రధాన కారణం. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం, బహిరంగ ప్రదేశాలను డంపింగ్ యార్డులుగా మార్చడం, చెత్త సేకరణ వ్యవస్థను సక్రమంగా వినియోగించుకోకపోవడం వంటి అలవాట్లు మారాలి. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు చెత్త సేకరణకు నిర్దిష్ట సమయాలు పాటించాలి. పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల పరిసరాలను ప్రత్యేక పారిశుద్ధ్య జోన్లుగా గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలి. చెత్తను తొలగించడం ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలి.

విద్యార్థుల ఆరోగ్యంతో రాజీ వద్దు : అపరిశుభ్ర వాతావరణం వల్ల దోమలు, ఈగలు, వ్యాధికారక క్రిములు పెరిగే ప్రమాదం ఉంది. దుర్వాసన, కలుషిత వాతావరణం విద్యార్థుల ఆరోగ్యంతో పాటు చదువుపై ఏకాగ్రతను కూడా దెబ్బ తీస్తాయి. ముఖ్యంగా బాలికలు చదువుకునే పాఠశాలల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. పాఠశాలల నిర్వహణను కేవలం విద్యాశాఖకే పరిమితం చేయకుండా మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలి.

ప్రతి పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి : రైల్వేకోడూరు ఘటన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఒక హెచ్చరికగా భావించాలి. ప్రభుత్వ పాఠశాలలే కాకుండా ప్రైవేటు విద్యాసంస్థల పరిసరాల్లోనూ పారిశుద్ధ్య పరిస్థితులను అధికారులు తనిఖీ చేయాలి. ప్రతి పాఠశాలకు సమీపంలో చెత్త పేరుకుపోకుండా స్థానిక సంస్థలు బాధ్యత తీసుకోవాలి. విద్యార్థులు తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసే వ్యవస్థ ఉండాలి. సోషల్ మీడియా ద్వారా సమస్యలు వెలుగులోకి వచ్చిన తర్వాతే అధికారులు స్పందించే పరిస్థితి మారాలి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం కావాలి. విద్యార్థులు చెత్త దుర్వాసన మధ్య చదువుకోవాల్సిన దుస్థితి ఏ సమాజానికీ గర్వకారణం కాదు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమంటే పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయులు, తరగతి గదులు కల్పించడం మాత్రమే కాదు. ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడం కూడా ప్రభుత్వ బాధ్యత. ఒక బాలికల పాఠశాల విద్యార్థినుల ఆవేదన రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల పరిస్థితులపై సమీక్షకు దారితీయాలి. మంత్రి స్పందనతో మొదలైన ఈ చొరవ క్షేత్రస్థాయిలో శాశ్వత మార్పునకు నాంది కావాలి. చెత్త రహిత పాఠశాలలు ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం. ఇదే నవ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం కావాలి.

యువ భారత్.. వృద్ధాప్యం వైపు !

తగ్గుతున్న జననాల రేటు..
పెరుగుతున్న వృద్ధుల సంఖ్య..
భవిష్యత్తుకు ఇప్పటి నుంచే సామాజిక భద్రత అవసరం



భారత్ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా నిలిచింది. యువత అధికంగా ఉన్న దేశమనే గుర్తింపు కూడా మనకుంది. మానవ వనరులే దేశ ఆర్థిక ప్రగతికి ప్రధాన బలమని భావిస్తున్నాం. అయితే రానున్న రెండు దశాబ్దాల్లో భారత జనాభా స్వరూపంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. జననాల రేటు తగ్గడం, వైద్య సదుపాయాలు మెరుగుపడటంతో సగటు ఆయుర్దాయం పెరగడం వంటి పరిణామాలు దేశంలో వృద్ధుల సంఖ్యను వేగంగా పెంచుతున్నాయి. ఒకప్పుడు జనాభా పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేసిన దేశం ఇప్పుడు వృద్ధాప్య జనాభా పెరుగుదలకు సిద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

కేంద్ర ప్రభుత్వ జనాభా అంచనాల ప్రకారం 2011లో దేశంలో 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్య సుమారు 10 కోట్లు ఉండగా, 2036 నాటికి అది 23 కోట్లకు చేరనుంది. మొత్తం జనాభాలో వృద్ధుల వాటా 2011లో 8.4 శాతం ఉండగా, 2036 నాటికి 14.9 శాతానికి పెరగనుంది. అదే సమయంలో 15 ఏళ్లలోపు పిల్లల జనాభా వాటా 30.9 శాతం నుంచి 20.1 శాతానికి తగ్గుతుందని అంచనా. అంటే దేశ జనాభాలో పిల్లల వాటా తగ్గుతూ, వృద్ధుల వాటా పెరుగుతున్నదన్నమాట. ఈ గణాంకాలు కేవలం జనాభా మార్పును మాత్రమే సూచించడం లేదు.. భవిష్యత్తులో దేశ ఆర్థిక, సామాజిక, ఆరోగ్య వ్యవస్థలు ఎదుర్కోబోయే సవాళ్లను కూడా ముందుగానే హెచ్చరిస్తున్నాయి.

దక్షిణాది రాష్ట్రాలకు ముందస్తు సవాలు : ఈ జనాభా మార్పు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఒకే విధంగా ఉండదు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల్లో వృద్ధుల జనాభా జాతీయ సగటు కంటే అధికంగా ఉండనుంది. 2036 నాటికి కేరళలో వృద్ధుల వాటా 23 శాతానికి, తెలంగాణలో 17.1 శాతానికి చేరవచ్చని అంచనాలున్నాయి. మెరుగైన విద్య, వైద్య సదుపాయాలు, మహిళల్లో అక్షరాస్యత, కుటుంబ నియంత్రణపై అవగాహన, ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం, పిల్లల పెంపకం ఖర్చులు పెరగడం వంటి అనేక కారణాలు జననాల రేటు తగ్గడలకు దోహదం చేస్తున్నాయి. మరోవైపు మెరుగైన వైద్యంతో ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తున్నారు. ఫలితంగా దక్షిణాది రాష్ట్రాలు జనాభా వృద్ధాప్య సవాలును ముందుగానే ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఈ పరిణామాన్ని కేవలం ఆర్థిక భారంగా చూడటం సరైన దృక్పథం కాదు. వృద్ధులు సమాజానికి భారమేమీ కాదు. కుటుంబ నిర్మాణానికి, సామాజిక విలువలకు, తదుపరి తరాల ఎదుగుదలకు తమ జీవితాలను అంకితం చేసిన అనుభవజ్ఞులు. వారి అనుభవం, విజ్ఞానం, సేవలను సమాజం వినియోగించుకోవాలి. అయితే వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, ఆదాయ భద్రత లేకపోవడం, ఒంటరితనం, కుటుంబ సంరక్షణ తగ్గిపోవడం వంటి అంశాలను నిర్లక్ష్యం చేయలేం. ముఖ్యంగా అసంఘటిత రంగంలో పనిచేసి పదవీ విరమణ అనంతరం ఎలాంటి పెన్షన్ సదుపాయం లేని కోట్లాది మందికి వృద్ధాప్యం ఆర్థికంగా సవాలుగా మారే ప్రమాదం ఉంది.

సంక్షేమం కాగితాలకే పరిమితం కాకూడదు : వృద్ధుల కోసం ప్రభుత్వాలు ప్రకటించే పథకాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకూడదు. ప్రతి జిల్లాలో సమగ్ర వృద్ధుల సంరక్షణ కేంద్రాలు, డే కేర్ సెంటర్లు, అవసరమైన చోట వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వృద్ధాప్య వైద్య విభాగాలను బలోపేతం చేయాలి. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, కీళ్ల సమస్యలు, మతిమరుపు వంటి వయోసంబంధిత సమస్యలకు నిరంతర వైద్య సేవలు అందించాలి. ఇంటి వద్దే వైద్య సేవలు అందించే వ్యవస్థను విస్తరించాలి. వృద్ధులకు అందించే పెన్షన్లు, ఆరోగ్య బీమా, మందుల సబ్సిడీలు వారి అవసరాలకు అనుగుణంగా ఉండాలి.

వృద్ధుల సంరక్షణ కూడా భవిష్యత్తులో ఒక ప్రత్యేక ఉపాధి రంగంగా ఎదగనుంది. ఇందుకోసం యువతకు జెరియాట్రిక్ కేర్, నర్సింగ్, ఫిజియోథెరపీ, హోమ్ కేర్ వంటి విభాగాల్లో నైపుణ్య శిక్షణ అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ద్వారా వృద్ధుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను రూపొందించాలి. వృద్ధులపై వేధింపులు, ఆస్తుల కోసం ఒత్తిళ్లు, నిర్లక్ష్యం వంటి సమస్యలను అరికట్టేందుకు చట్టాల అమలును మరింత పటిష్టం చేయాలి. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమానికి సంబంధించిన చట్టాలు సమర్థంగా అమలయ్యేలా చూడాలి.


ఆంధ్రప్రదేశ్ ఇప్పుడే మేల్కొనాలి : ఈ పరిణామం ఆంధ్రప్రదేశ్‌కు మరింత ప్రాధాన్యం కలిగిన అంశం. రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులను గుర్తించి వారి ఆరోగ్యం, ఆర్థిక స్థితిగతులు, కుటుంబ పరిస్థితులపై వివరాలు సేకరించాలి. అర్హులైన వారందరికీ సామాజిక భద్రతా పింఛన్లు అందేలా చూడటంతో పాటు, అవసరమైన వారికి ఇంటి వద్ద వైద్య సేవలు అందించాలి. పట్టణాలు, గ్రామాల్లో వృద్ధుల కోసం పగటిపూట గడిపే కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కుటుంబ సభ్యులు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఒంటరిగా మిగిలిపోతున్న వృద్ధులపై ప్రత్యేక దృష్టి సారించాలి. అంతేకాకుండా, వృద్ధుల జనాభా పెరుగుదల దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యతలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. జననాల రేటును విజయవంతంగా తగ్గించిన రాష్ట్రాలు భవిష్యత్తులో జనాభా ఆధారిత వనరుల పంపిణీ, కార్మిక శక్తి లభ్యత, ఆరోగ్య వ్యయాలు, పెన్షన్ బాధ్యతల విషయంలో కొత్త సవాళ్లను ఎదుర్కోవచ్చు. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలు జనాభా స్వరూపంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రూపొందాలి.

వృద్ధాప్యం శాపం కాకూడదు : భారత్‌కు ప్రస్తుతం యువ జనాభా రూపంలో ఒక గొప్ప అవకాశముంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో భవిష్యత్తులో వృద్ధులుగా మారబోయే నేటి యువతకు కూడా సామాజిక భద్రత కల్పించే విధానాలు ఇప్పటి నుంచే రూపొందించాలి. కుటుంబ వ్యవస్థలో పెద్దలకు గౌరవం, సమాజంలో వారికి సముచిత స్థానం, ప్రభుత్వ విధానాల్లో వారికి భరోసా ఉండాలి.

జనాభా పెరుగుదల ఒకప్పుడు దేశానికి సవాలుగా కనిపిస్తే, ఇప్పుడు జనాభా వృద్ధాప్యం మరో కొత్త సవాలుగా మారుతోంది. అయితే వృద్ధుల సంఖ్య పెరగడం అనివార్యమైన ప్రకృతి, సామాజిక పరిణామం మాత్రమే. దానిని సంక్షోభంగా మార్చాలా, సమర్థవంతమైన సంక్షేమ వ్యవస్థకు అవకాశంగా మలచాలా అన్నది పాలకుల దూరదృష్టిపై ఆధారపడి ఉంటుంది. యువతకు ఉపాధి.. వృద్ధులకు భద్రత.. ప్రతి తరానికి గౌరవం కల్పించినప్పుడే వికసిత భారత్ లక్ష్యం సార్థకమవుతుంది.

ఓటు.. అమ్మకానికి కాదు !

ప్రజాస్వామ్యానికి అసలైన విలువ చాటిన చిత్తూరు ఓటరు.. ప్రలోభాల రాజకీయాలకు చెంపపెట్టు



ఎన్నికలంటేనే డబ్బు పంపిణీ.. ఓటుకు నోటు.. మద్యం, ఇతర ప్రలోభాలు.. ఇదే నేటి రాజకీయ వ్యవస్థలో సాధారణ దృశ్యంగా మారుతున్న తరుణంలో చిత్తూరు జిల్లాలో చోటుచేసుకున్న ఒక అరుదైన ఘటన ప్రజాస్వామ్య విలువలను మరోసారి గుర్తుచేసింది. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఇచ్చిన వెయ్యి రూపాయలను తిరిగి ఇచ్చేస్తూ ఓ ఓటరు చాటిన నిజాయితీ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఓటు హక్కు విలువ ఏమిటో, ప్రజాస్వామ్యంలో ఓటరు స్థానం ఎంత ఉన్నతమైనదో ఈ ఘటన స్పష్టం చేసింది.

చిత్తూరు జిల్లా పలమనేరు రూరల్ మండలం మురం గ్రామంలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఒక ఓటరుకు అందిన రూ.వెయ్యి నగదును తిరస్కరిస్తూ, రెండు రూ.500 నోట్లతో పాటు ఒక లేఖను బ్యాలెట్ బాక్సులో వేశాడు. 'అయ్యా.. మీరు ఇచ్చిన రూ.1000 మీరే తీసుకోండి. నేను డబ్బులు తీసుకుని ఓటు వేయను. ధన్యవాదాలు' అంటూ ఆ లేఖలో తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించాడు. పలమనేరు డిగ్రీ కళాశాలలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఈ ఓటరు చైతన్యాన్ని అభినందించడం అభినందనీయం.

ఈ ఘటనను కేవలం ఒక వ్యక్తి నిజాయితీగా చూడటం సరిపోదు. ఎన్నికల ప్రక్రియలో పెరిగిపోతున్న ధన ప్రభావంపై సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని ఇది గుర్తుచేస్తోంది. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఒక బటన్ నొక్కడం లేదా బ్యాలెట్ పత్రంపై ముద్ర వేయడం మాత్రమే కాదు. ఐదేళ్లపాటు తమ తరఫున పాలించే ప్రజాప్రతినిధిని ఎన్నుకునే అత్యంత విలువైన అధికారం. ఆ అధికారాన్ని కొన్ని వందల రూపాయలకు తాకట్టు పెట్టడం అంటే తమ భవిష్యత్తును తామే ప్రశ్నార్థకం చేసుకోవడం. ఎన్నికల సమయంలో ఇచ్చే తాత్కాలిక ప్రయోజనాల కంటే ఐదేళ్ల పాలనలో లభించాల్సిన అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు ఎంతో విలువైనవి.

ఓటుకు నోటు సంస్కృతి పెరగడానికి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మాత్రమే కారణమని చెప్పి ఓటర్లు తమ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. డబ్బులు తీసుకుని ఓటు వేయడం తమ హక్కును అమ్ముకోవడమేనన్న స్పృహ ప్రతి ఒక్కరిలో రావాలి. అదే సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టే అభ్యర్థులపై ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించాలి. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రాజకీయాల్లో గెలుపే పరమావధిగా భావించి నైతిక విలువలను పక్కనపెట్టే ధోరణికి అడ్డుకట్ట వేయాలి.

మరోవైపు, ఓటుకు డబ్బులు పంచి ఓడిపోయిన అభ్యర్థులు ఇచ్చిన సొమ్మును తిరిగి ఇవ్వాలని ఓటర్లను కోరుతున్న ఘటనలు కూడా రాజకీయాల్లో నెలకొన్న విచిత్ర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. చిత్తూరు జిల్లాలోనే పలమనేరు మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థి ఓటర్లకు పంపిణీ చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరిన ఘటన కూడా ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ రెండు పరిణామాలు ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఎంతగా విస్తరించిందో తెలియజేస్తున్నాయి.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటరు. ఆ ఓటరు చైతన్యవంతుడైనప్పుడే వ్యవస్థ బలపడుతుంది. అభ్యర్థి ఇచ్చే నోటు కంటే ప్రజాప్రతినిధి అందించాల్సిన సేవలు, అభివృద్ధి, జవాబుదారీతనం ముఖ్యమని ప్రతి ఓటరూ గుర్తించాలి. మురం గ్రామానికి చెందిన ఆ ఓటరు చేసిన పని ఒక వ్యక్తి నిజాయితీకి మాత్రమే ప్రతీక కాదు.. ఎన్నికల వ్యవస్థలో రావాల్సిన మార్పునకు ఒక బలమైన సందేశం. ఓటు అమ్ముకోవడానికి కాదు.. పాలకులను ఎన్నుకోవడానికి. ఓటు విలువ తెలిసిన పౌరుల చేతుల్లోనే ప్రజాస్వామ్య భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. ఓటుకు నోటు కాదు.. ఓటుకు గౌరవం కావాలి.

రైల్వే జీఎంతో ఎంపీ లక్ష్మణ్ సమావేశం



అడ్డగుట్ట, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో రైల్ నిలయంలోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం రాజ్య సభ సభ్యులు, రైల్వే పార్లమెంటరీ స్థాయీ కమిటీ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ సమావేశం అయ్యారు. తెలంగాణకు సంబంధించిన రైలు అభివృద్ధి ప్రణాళికలు, పండుగ సీజన్‌లో ప్రత్యేక రైళ్లను నడపడంపై చర్చించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకట రమణి, భరత్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజుల్లో ఇంటింటి సర్వే పూర్తి చేయాలి

- షాబాద్‌ను రాష్ట్రంలోనే తొలి 100 శాతం అక్షరాస్య మండలంగా తీర్చిదిద్దాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశం



రంగారెడ్డి జిల్లా నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : ఉల్లాస్ - నవ భారత్ సాక్షరతా కార్యక్రమం ద్వారా రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలాన్ని రాష్ట్రంలోనే తొలి 100 శాతం అక్షరాస్య మండలంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఈ లక్ష్య సాధనలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటింటి సర్వేను ఐదు రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. SEEEPC సర్వే ప్రకారం షాబాద్ మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 15,507 కుటుంబాలు ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు.ఈ కుటుంబాలను అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు,SERP VOAs,VB-G RAM G సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులకు సమానంగా కేటాయించి ప్రతి ఇంటిని సందర్శించాలని సూచించారు. 15 ఏళ్లు నిండిన ప్రతి నిరక్షరాస్యుడిని గుర్తించి వయోజన విద్యాశాఖ అందించే ప్రొఫార్మాలో వివరాలు నమోదు చేయాలని,ముఖ్యంగా 15 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల నిరక్షరాస్యుల వివరాలను ఉల్లాస్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.సర్వే నిర్వహణకు ఎంపీడీవోను మండల స్థాయి ఓవరాల్ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఎమ్మార్వో, ఏంఈఓ,సీడీపీఓ,ఏపీఎం,ఏపీఓ అధికారులు తమ పరిధిలోని సిబ్బందిని వెంటనే కేటాయించి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సర్వే పూర్తయిన వెంటనే గ్రామాల్లో అక్షర కేంద్రాలను ఏర్పాటు చేసి వాలంటీర్లు,కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) సహకారంతో బోధనా కార్యక్రమాలు ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు.ప్రతి ఒక్కరికీ అక్షరాస్యత అందించడమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు,సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి అవసరమైన ప్రొఫార్మా, శిక్షణ,సాంకేతిక సహకారాన్ని జిల్లా వయోజన విద్యా ఉప సంచాలకులు కె.అనిత అందిస్తారని తెలిపారు.నిర్దేశించిన ఐదు రోజుల గడువులో సర్వే పూర్తి చేసి లక్ష్య సాధన దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

అర్వపల్లి స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

- ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు న్యాయం చేయాలి.
- జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ.



సూర్యాపేట, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ అన్నారు. మంగళవారం అర్వపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది విధులు, పెట్రోలింగ్ నిర్వహణ, కేసుల పురోగతిని పరిశీలిం చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యా దుపై తక్షణమే స్పందించాలని, కేసుల నమోదులో జాప్యం చేయరాదని సూచించారు. ఫిర్యాదులపై వేగంగా ప్రాథమిక విచారణ చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మండల పరిధిలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలా పాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, పాత నేరస్థులు, షీటర్లు, గంజాయి కేసుల్లో నిందితుల కదలికలను గ్లోబల్ జియోట్యాగింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అప్రమత్తంగా, బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ తనిఖీలో నాగారం సీఐ నాగేశ్వరరావు, అర్వపల్లి ఎస్ఐ మధు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి భరోసా..

- ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక చేయూత!
- పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ భరోసా
- 53 మంది లబ్ధిదారులకు రూ.15.72లక్షల సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం
- చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన : ఎమ్మెల్యే కాలే యాదయ్య



శంకర్‌పల్లి, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు.ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు,అర్హులైన వారికి చేయూత పింఛన్ల మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.శంకర్‌పల్లి పట్టణంలోని మణి గార్డెన్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా శంకర్‌పల్లి మండలం, మున్సిపా లిటీ పరిధిలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించి మొత్తం 53 మంది లబ్ధిదారులకు రూ.15,72,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.అనారోగ్య సమస్యలు, వైద్య ఖర్చులు,ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ..ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పేదలు,వృద్ధులు,ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించడం అభినందనీయమని తెలిపారు.శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని అన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి వారికి ప్రభుత్వ సహాయాన్ని అందించడంలో ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.శంకర్‌పల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు,పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం సంతోషకరమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సర్పంచులు,ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్,వైస్ చైర్మన్ జూలకంటి శ్వేత పాండురంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోవిందమ్మ,గోపాల్ రెడ్డి,మోకిలా పీఏసీఎస్ చైర్మన్ గౌంద్ర సత్యం,మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి,పిల్లిగుండ్ల సర్పంచ్ స్వాతి కాంత్ రెడ్డి,సంకేపల్లి గోపాల్,సంకేపల్లి సర్పంచ్ శ్రీనివాస్, అంతప్పగూడ సర్పంచ్ బీరయ్య, చందిప్ప సర్పంచ్ మల్లికార్జున,మోకిలా సర్పంచ్ శేఖర్,గోపులారం సర్పంచ్ రవీందర్ రెడ్డి,కొత్తపల్లి సర్పంచ్ బలవంత్ రెడ్డి,శంకర్‌పల్లి ఎమ్మార్వో సురేందర్,ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తదితర ప్రజాప్రతి నిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత

- కీసర సర్కిల్ పరిధిలో 2,500 మందికి నూతన పెన్షన్లు మంజూరు



కీసర, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్ల ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం దమ్మాయిగూడలోని సాయిభవాని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కీసర సర్కిల్ పరిధిలో నూతనంగా అర్హత పొందిన 2,500 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు ఉత్తర్వులు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్, డివిజన్ అధ్యక్షులు ముప్ప రామారావు, శాంతి కోటేష్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, రామిడి స్వప్న విజయ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు సిబ్బంది విధులకు సకాలంలో రావాలి : ఆర్డీవో ఎస్.రమణారెడ్డి



మిర్యాలగూడ నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : డాక్టర్లు, సిబ్బంది విధులకు సకాలంలో రావాలని మిర్యాల గూడ ఆర్డిఓ ఎస్. రమణారెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ల, సిబ్బంది హాజరు రిజిస్టర్లను ఆయన తనిఖీ చేసి సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని పిల్లల విభాగం, ప్రసూతి విభాగం, మందుల స్టోర్, ల్యాబ్, నేత్ర విభాగం, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రిజిస్టర్లు, నీటి సరఫరా, టాయిలెట్స్, ఇన్ పేషెంట్ వార్డులు, డయాలసిస్ విభాగం ను సుమారు రెండు గంటలపాటు పరిశీలిం చారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించాలని కోరారు. రోగులతో ఆర్డిఓ. మాట్లాడారు. డాక్టర్లు ఉదయం సుమారు 10 గంటలకు 12 గంటలకు వెళ్లి పోతారని డ్యూటీ డాక్టర్ ఒక్కరే వంతుల వారిగా ఒకొక్కరే ఉంటారని ఆర్డీఓ కు చెప్పినట్లు రోగులు తెలిపారు. ఆయన వెంట ట్రైని ఐఎఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలి

- జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్ కుమార్



సూర్యాపేట, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ హామీని పట్టించుకోవడం లేదని టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ జడ్పీ కార్యాలయం ఎదుట పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్మదీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతోనే ఉద్యోగులు మద్దతు తెలిపారని, కానీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా సీపీఎస్ సమస్యను పరిష్కరించడం లేదని విమర్శించారు. సీపీఎస్ ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం పెన్షన్, హెల్త్ కార్డులు లేకపోవడం ఆందోళనకరమన్నారు. మరో మూడు నెలల్లోగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరణ నిరాహార దీక్షకు దిగేందుకు కూడా వెనుకాడరని హెచ్చరించారు. అనంతరం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్‌కు వినతిపత్రం అందజేశారు.

మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఘనంగా అయ్యప్ప పడిపూజ



మణికొండ, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : మణికొండ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్ లో మంగళవారం ఐడియల్ బిల్డర్స్ సురేష్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కేశవ గురుస్వామి ఆధ్వర్యంలో పడి పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా కార్తీకమాసంలో 41 రోజులు అన్నదాన కార్యక్రమాలు, రాత్రి అల్పాహార కార్యక్రమాలు రోజుకు 2000 మంది అయ్యప్ప భక్తులకు ప్రసాదం అందిస్తున్నట్టు తెలిపారు.

అలాగే ప్రతి సంవత్సరం మహా పడిపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని ఈ పడిపూజ రోజున 2000 మంది అయ్యప్ప స్వాములు వస్తారని అనంతరం స్వామివారి ఊరేగింపులు ఉంటాయని, ఏనుగు అంబానీపై ఊరేగింపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పూజ కార్యక్రమానికి బిల్డర్ రాహుల్, కాంగ్రెస్ నాయకులు మెరుగు జితేందర్, రామకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ నేతలు ఉపేందర్ రెడ్డి, అందే లక్ష్మణ్, కుంభగళ్ళ రవికాంత్, మల్లికార్జున్, అల్కాపూర్ టౌన్‌షిప్ నాయకులు కాలనీ అధ్యక్షులు కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



యాదాద్రి భువనగిరి నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : యాదాద్రి భువనగిరి జిల్లా భువన గిరి మున్సి పాలిటీ పరిధిలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వ హించిన ఎల్లమ్మ తల్లి జమదగ్నిల కళ్యాణ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఆలయ కమిటీ చైర్మన్ మాజీ ఎంపీపీ తోటకూర వెంకటేష్ యాదవ్ మరియు సభ్యులు బీర్ల ఐలయ్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో , ఆయురారోగ్యాలతో , అష్టైశ్వర్యాలతో వర్ధిల్లా లని ఆకాంక్షించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన అమ్మవారి కళ్యాణ వేడుకల్లో భక్తులతో కలిసి పాల్గొని ఆధ్యాత్మిక వాతా వరణంలో గడిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆలయ సిబ్బంది , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు చందనోత్సవం, మహా సంప్రోక్షణకు గవర్నర్‌కు ఆహ్వానం..

- 60 ఏళ్లకోసారి జరిగే మహోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానం
- గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, దేవాదాయ శాఖ అధికారులు



హైదరాబాద్, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న అరుదైన ఆధ్యాత్మిక వేడుకలకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ఆహ్వానం అందింది. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్న చందనోత్సవం, మహాసంప్రోక్షణ, నిజరూప దర్శన మహోత్సవాలకు హాజరుకావాల్సిందిగా గవర్నర్‌ను ఆహ్వానించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రెవెన్యూ, దేవాదాయ శాఖల ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు తదితరులు మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కొండగట్టు క్షేత్ర పురాణం, ఆలయ ఆవిర్భావం, స్థలపురాణం, ఆధ్యాత్మిక విశిష్టత, చారిత్రక ప్రాశస్త్యాన్ని గవర్నర్‌కు వివరించారు. ఆరు దశాబ్దాలకోసారి నిర్వహించే ఈ అరుదైన ఆధ్యాత్మిక ఉత్సవాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, స్వామివారి మహోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించారు.

– గవర్నర్‌ను కలిసిన డీజీపీ సౌమ్య మిశ్రా :

మరోవైపు మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా కూడా మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలు, మహిళల రక్షణకు అమలు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించారు.

చేయూత పింఛన్లు పంపిణీ.



ఏన్కూరు, నవంబరు 18(జర్నలిస్ట్ ఫైల్) : రేపల్లెవాడ గ్రామపంచాయతీ పరిధిలో చేయూత పింఛన్లకు సంబంధించిన పత్రాలను గ్రామ సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్ మంగళవారం లబ్ధిదారులకు అంద జేశారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్ర మంలో ఆయన లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పింఛన్లకు సంబంధించిన పత్రాలను లబ్ధిదారులు స్వీక రించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జపాన్ అభివృద్ధి నమూనాలతో భద్రాద్రి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- జపాన్‌లో కలెక్టర్ అంకిత్ అధ్యయన పర్యటన.



భద్రాద్రి కొత్తగూడెం,నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్రాభివృద్ధికి దోహదపడేలా జపాన్‌లో అమల వుతున్న ఆధునిక అభివృద్ధి నమూనాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన పరి పాలనా విధానాలపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యయనం చేస్తున్నారు.నీతి ఆయోగ్, జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జే ఐసిఏ) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ అండ్ బ్లాక్స్ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 15 నుంచి 21 వరకు జపాన్‌లో నిర్వహిస్తున్న అధ్యయన పర్యటనలో కలెక్టర్ పాల్గొంటున్నారు.ఈ పర్యటనలో విద్య, వైద్యం, వ్యవసాయం, పోషకాహారం, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో జపాన్ అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, స్థానిక సంస్థల పనితీరు, సమర్థవంతమైన పరిపాలనా పద్ధతులపై అవగాహన పొందుతున్నారు.జిల్లాలోని ఆస్పిరేషనల్ బ్లాక్‌తో పాటు ఇతర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి జపాన్ నమూనాలను స్థానిక పరిస్థితులకు అనుగు ణంగా అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఈ పర్యటన ద్వారా పొందిన అను భవాలు, పరిజ్ఞానాన్ని జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు వినియోగించి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవం తంగా అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయనుంది.

హాకీంపేటలో ఖేలో ఇండియా జాతీయ యువ క్రీడలకు వేదిక

- డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీలు..
  వెయిట్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్, మల్లఖంబ్ పోటీలు నిర్వహణ





మేడ్చల్, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్రంలో 8వ ఖేలో ఇండియా జాతీయ యువ క్రీడలు–2026 నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతు న్నాయి. తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఇందులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హాకీంపేటలో వెయిట్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్, మల్లఖంబ్ పోటీలను నిర్వహించనున్నారు.ఈ క్రీడల నిర్వహణలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి ఐఏఎస్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా జాతీయ యువ క్రీడల లోగోను ఆవిష్కరించి, బెలూన్లు ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస విద్యా వారధి.

- ఆదివాసీ విద్యార్థుల భవిష్యత్తుకు ఆశాదీపం.
- నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం.
- పేద విద్యార్థుల చదువుకు దాతల చేయూత అభినం దనీయం. పూర్క చిత్రు,కుమ్ర రాజేశ్వర్ రావు.



జన్నారం, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : ఏజెన్సీ ప్రాంతాల్లోని నిరుపేద ఆదివాసీ, దళిత విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలనే మహోన్నత లక్ష్యంతో వ్యాస స్కూల్ చైర్మన్ వినోద్ నాయక్ చేపట్టిన,వ్యాస విద్యా వారధి' కార్యక్రమం పేద విద్యార్థుల జీవితాల్లో విద్యా వెలుగులు నింపుతోందని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పూర్క చిత్రు, సమక్క గ్రామ సర్పంచ్ కుమ్ర రాజేశ్వర్ రావు కొనియాడారు. ఆర్థిక ఇబ్బందులతో నాణ్యమైన విద్యకు దూరమవుతున్న నిరుపేద పిల్లలకు ఈ కార్యక్రమం అండగా నిలుస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంద్రవెల్లి మండలంలోని గోండుగూడ కాలనీకి చెందిన ఓ విద్యార్థికి వ్యాస స్కూల్‌లో ఉచితంగా ప్రవేశం కల్పించారు.ఆర్థిక పరిస్థితులు విద్యకు అడ్డంకిగా మారకూడదనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు అందుతు న్నాయని వారు హర్షం వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా వ్యాస స్కూల్ చైర్మన్ వినోద్ నాయక్ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తూ,వారి విద్యాభ్యాసానికి ఆర్థిక సహకారం అందిస్తున్న దాతల సేవలు వెలకట్టలేనివని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందిం చాలని పిలుపునిచ్చారు.తాజాగా అడ్మిషన్ పొందిన విద్యార్థి పూర్తి చదువు బాధ్యతను నల్గొండ జిల్లాకు చెందిన, ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గాయం సుమంత్ స్వీకరించడం అభినందనీయమని తెలిపారు. నిరుపేద విద్యార్థి విద్యాభ్యాసానికి బాధ్యత తీసుకున్న సుమంత్‌కు వ్యాస స్కూల్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఒక విద్యార్థికి అందించే విద్యా సహాయం అతని జీవితాన్నే కాదు, ఒక కుటుంబ భవిష్యత్తును మార్చగలదనే ఆశయంతో వ్యాస విద్యా వారధి కార్యక్రమం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు గేడం లాలు ప్రసాద్, రాజిగోండ్ సేవా సమితి విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు చాహకటి విశాల్, తుడుందెబ్బ సాంస్కృతిక కార్యదర్శి దుర్వ జైవంత్, ఏఎస్‌యూ ఉపాధ్య క్షుడు ఆత్రం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

- ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిపారసుతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు
- లబ్ధిదారులకు 6,05,000 విలువగల చెక్కులను అందజేసిన బీఆర్ఎస్ నాయకులు







షాద్‌నగర్,నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాల యంలో ఫరూక్ నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన పులి అరుణ,ఈగ సుశాంక్,కొ త్తోల్ల ప్రణీత్,కటిక సత్యనారాయణ,కిషన్ నగర్ గ్రామానికి చెందిన ఉమామహేశ్వరి, ఎల్లంపల్లి గ్రామానికి చెందిన రాములమ్మ,లింగారెడ్డి గూడ గ్రామానికి చెందిన బక్కని యాదయ్య,ఎలికట్ట గ్రామానికి చెందిన నారం పుల్లారెడ్డి,కందివనం గ్రామానికి చెందిన డి.రామచంద్రయ్య,పులి చెర్ల కుంట తండా గ్రామానికి చెందిన మురళి,దేవుని పల్లి గ్రామానికి చెందిన పారా బాల్ రాజ్,రంగస ముద్రం గ్రామానికి చెందిన జవ్వాజి స్వాతి తదితరు లకు మంజూరైన 605000/ విలువగల సియంఆ ర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు.అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబా లకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఆయన సిఫారసుతో ప్రభుత్వానికి నివేదించగా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు షాద్ నగర్ ఎమ్మెల్సి నవీన్ రెడ్డి కార్యాలయంలో లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు,ప్రజ లకు ఎమ్మెల్సీ ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.తమకు ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,మాజీ కౌన్సిలర్ నందకిషోర్,మొగిలి గిద్ద సర్పంచ్ బుగ్గ క్రిష్ణ,కందివనం సర్పంచ్ అమ్మనాయక్,మాజీ ఎంపిటిసి బిశ్వ క్రిష్ణ,మాజీ సర్పంచ్లు ప్రశాంత్ రెడ్డి,తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,ఉపసర్పంచ్లు యాదగిరి,మూడవత్ గణేష్,మాజీ ఉపసర్పంచ్లు మల్లేష్ యాదవ్,నరేష్,బీఆర్ఎస్ నాయకులు శంకరయ్య గౌడ్,శేరి శ్రీనివాస్ రెడ్డి,బించోడ్ బాల్ రాజ్,కంసాన్ పల్లి బాల్ రాజ్,నేనావత్ నరేష్,శివ,అన్వాలీ రాజు,బినేష్ సాగర్,మధు, ప్రశాంత్,శేఖర్,కుమార్,సురేష్,గోపాల్మల్లేష్,బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల గడపకు పెన్షన్ భరోసా!

- తూర్పులో 2,740 మందికి చేయూత – కొండా సురేఖ





వరంగల్, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్) : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ సంక్షేమ పాలన కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.మంగళ వారం వరంగల్‌లోని ఎల్కీనగర్ ఏ1 కన్వెన్షన్ హాల్‌లో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన కొండా సురేఖ, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ టి. వెంకన్నతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరంగల్ తూర్పు నియోజకవ ర్గంలో కొత్త పెన్షన్ల కోసం 3,675 దరఖాస్తులు రాగా, 2,740 మందికి ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేసిందని తెలిపారు. వీటి ద్వారా ప్రతి నెలా రూ.69,89,840 ఆర్థిక సహాయం అందనుం దని వెల్లడించారు. కొత్తగా పెన్షన్లు పొందుతున్న వారిలో 733 మంది దివ్యాంగులు, 1,704 మంది వితంతువులు, 188 మంది ఒంటరి మహిళలు, 98 మంది నేత కార్మికులు, 17 మంది తాటి గీత కార్మికులు ఉన్నారని వివరించారు.నియోజకవ ర్గంలో ఇప్పటికే 35,716 మంది చేయూత పెన్షన్లు పొందుతున్నారని, కొత్తగా మంజూరైన పెన్షన్ నగదును ఈ నెల 19న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. అదే రోజు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభమ వుతుందని తెలిపారు. పెన్షన్లు మంజూరు కానివారి దరఖాస్తులను మరోసారి పరిశీలించి అర్హులందరికీ న్యాయం చేస్తామని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలోనూ పేదలకు ప్రాధాన్యత కల్పిస్తామని భరోసా ఇచ్చారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా వ్యాప్తంగా కొత్తగా 11,750 చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని, ఇందుకోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.2.94 కోట్ల ఆర్థిక సహాయం అందించనుందని తెలిపారు. కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలను అమలు చేస్తోందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం కానుందని తెలిపారు. బల్దియా కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికా రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, అదనపు కమిషనర్ ఇన్‌చార్జి సమ్మయ్య, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా పరిశ్రమల అధికారి నరసింహమూర్తి, ఎంహెచ్ డాక్టర్ రాజేష్, వరంగల్ మండల తహసిల్దార్ శ్రీకాంత్, నవీన్ రాజ్ మాజీ కార్పొరేటర్ పుర్ఖాన్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'అక్వాన్' తుఫాన్ ముప్పు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్):బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుఫాన్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ఈనెల 22వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.
గతంలో సంభవించిన 'అర్నాబ్', 'మురసు' తుఫాన్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, అక్వాన్ తుఫాన్ తీవ్రతను ఎదుర్కొనేందుకు పటిష్టమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, దూర ప్రయాణాలను తక్షణమే విరమించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని పర్యాటక కేంద్రాలకు సందర్శకులు, పర్యాటకులు ఎవరూ రావొద్దని ఆయన ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. రెడ్ అలెర్ట్ ప్రకటించిన జిల్లాల అధికారులు లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. తుఫాన్ బాధితుల కోసం ముందస్తుగానే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడ సరిపడా ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు సిద్ధంగా ఉంచాలి. బాధితుల కోసం ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు, కంట్రోల్ రూమ్స్ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు (అలెర్ట్స్) పంపి అప్రమత్తం చేయాలి. తుఫాన్ పరిస్థితులపై ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉండి అవసరమైన సహాయక చర్యలు తీసుకుంటుందని మంత్రి కందుల దుర్గేష్ భరోసా ఇచ్చారు.

సెన్సస్-2027 ఫీల్డ్ ట్రైనర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు



గుంటూరు, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): సెన్సస్-2027 నిర్వహణలో భాగంగా ఫీల్డ్ ట్రైనర్లకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ, జనాభా గణన ప్రక్రియలో ఫీల్డ్ ట్రైనర్ల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సెన్సస్ విధివిధానాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణ పొందిన ఫీల్డ్ ట్రైనర్లు డిసెంబర్ 3వ తేదీ నుంచి జిల్లాలోని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ అందించనున్నారని తెలిపారు. జనాభా గణనకు సంబంధించిన మార్గదర్శకాలు, విధివిధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన అవగాహన కల్పించి, సెన్సస్--2027 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా సిద్ధం చేయాలని సూచించారు. జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా సెన్సస్ కోఆర్డినేటర్లు ఆదిలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

20న మద్రాస్ వారి అన్నదాన ట్రస్ట్ ప్రారంభోత్సవం



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి జయంతిని పురస్కరించుకొని ఈనెల 20వ తేదీన మద్రాస్ వారి అన్నదాన సత్రం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. 21వ తేదీ వీరబ్రహ్మేంద్రస్వామి 418 వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ రెండు రోజులపాటు అనగా 20వ తేదీ(శుక్రవారం)మరియు 21 వ తేదీ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి వేడుకలు రెండు రోజులపాటు మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు అన్నదానం నిర్వహించబడును. ఇట్టి కార్యక్రమాలకు భక్తులు పురప్రజలు యావన్మంది పాల్గొని మా ఆతిథ్యం స్వీకరించవలసిందిగా ట్రస్ట్ కార్యనిర్వాహకులు అధ్యక్షులు జయరామన్, ఉపాధ్యక్షులు వీరబ్రహ్మం, సెక్రటరీ రవిచంద్రన్ , జాయింట్ సెక్రెటరీ బాబు, కోశాధికారి సుందరం, ఉపకోశాధికారి మాణిక్యం స్థానిక నిర్వాహకులు పి జగదీష్ పత్తి వెంకటేశ్వర్లు కొమ్మ కుళ్లాయప్ప తదితరులు తెలిపారు.

ఏపీ పెట్టుబడులకు స్వర్గధామం : ఎమ్మెల్యే నసీర్

- వైజాగ్ సమ్మిట్ ద్వారా పెట్టుబడుల వరద
- యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు దక్షతతో రాష్ట్రాభివృద్ధి



గుంటూరు, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని, యువతకు ,20 లక్షల ఉద్యోగాలు రానున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వైజాగ్ వేదికగా రాష్ట్రంలో పెట్టుబడిల వరద సాగిందని తెలిపారు. విజనరీ లీడర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,, విద్యాశాఖ మంత్రి లోకేష్ దక్షతతో వ్యాపార సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని చెప్పారు. గూగుల్ వంటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రధాన వ్యాపార సంస్థలు సైతం తరిమికొట్టారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అన్ని విభాగాల్లో ఉద్యోగాల కల్పన ధ్యేయంగా కూడమి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. గతంలో వ్యవసాయం రంగానికే రాష్ట్రంలో ప్రాధాన్యత ఉండేదని, ప్రస్తుతం వ్యాపార అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ వండి రంగాలను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా యువతకు మంచి భవిష్యత్ అందించే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు ఇదే కాకుండా ప్రతి నియోజకవర్గంలో ఉపాధి, నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర వ్యాపార అభివృద్ధిలో మైలురాయి అని తెలిపారు.

డిసెంబరు 22న ఎస్.ఐ.ఆర్ తుది జాబితా ప్రకటన



గుంటూరు, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్.ఐ.ఆర్)లో భాగంగా తుది జాబితాను డిసెంబరు 22న విడుదల చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం స్థానిక ఎన్నికలపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారం ఇంకా అందించని ఆబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్, డిసీజ్డ్ (ఏ,ఎస్,డి,డి) జాబితాలో ఉన్న 2.37 లక్షల మంది మాత్రం నవంబరు 30వ తేదీ లోపు సమర్పించవచ్చని చెప్పారు. కొత్త వారి నుండి తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. డిసెంబరు 10వ తేదీ లోగా విచారణలు పూర్తి చేసి అర్హులను జాబితాలో చేర్చడం జరుగుతుందని చెప్పారు.

ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఓటరుకు డిసెంబరు 23 నుండి జనవరి 12 వరకు మరో అవకాశం

ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఎన్నికలకు సంబంధించి ఓటరుగా నమోదు కావడానికి డిసెంబరు 23 నుండి జనవరి 12 వరకు మరో అవకాశం ఉంటుందని గుంటూరు - కృష్ణా ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఇ.ఆర్.ఓ మరియు జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందని చెప్పారు. పూర్వ గుంటూరు, కృష్ణా జిల్లాలలో పనిచేస్తున్న ఉన్నత పాఠశాల మరియు ఆపై స్థాయిలో బోధనలో ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటరుగా నమోదు కావడానికి అర్హులన్నారు. భారత ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు స్థానిక నివాసం ఉన్నప్పుడు మాత్రమే ఓటరుగా అర్హులుగా పరిగణింపడం జరుగుతుందని స్పష్టం చేశారు. 2026 నవంబరు 1వ తేదీకి ముందు ఆరు సంవత్సరాల నుండి వృత్తిలో కొనసాగాలని అందులో కనీసం మూడు సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాల, ఆపై స్థాయిలో బోధన అనుభవం ఉండాలని అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు అర్హత కలిగి ఉంటారని, వారికి జిల్లా విద్యాశాఖ అధికారి, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఓ), కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ నిర్ధారణ చేయాలని వివరించారు. ఓటరుగా ఆన్లైన్ ద్వారా నమోదు కావచ్చని లేదా ఫారం 19 పూర్తి చేసి ఏ.ఈ.ఆర్.వోలు ఉన్న స్థానిక తాసిల్దార్, ఎంపీడీవో, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లకు సమర్పించవచ్చని చెప్పారు. ఇప్పటి వరకు 15 వేల దరఖాస్తులు అందాయని, మొత్తం 19 వేల వంకు పనిచేస్తున్నట్లు అంచనా ఉందని చెప్పారు.
ఈ సమావేశంలో కాంగ్రెసు పార్టీ ప్రతినిధి కె.కె.గుప్తా, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు కంచర్ల శివరామయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా.టి.సేవ కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతన గండ్ల వాసు, సి.పి.ఐ (ఎం) ప్రతినిధి కృష్ణకాంత్, వైఎస్ఆర్సిపి ప్రతినిధి వై పిచ్చి రెడ్డి, జన సేన పార్టీ ప్రతినిధి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు, హడ్కో సహకారం కోరిన కమిషనర్

- రూ.471.65 కోట్లతో మూడు కీలక ప్రాజెక్టులు..
- ఆర్థిక, సాంకేతిక సహకారం అందించాలని విజ్ఞప్తి



గుంటూరు, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): రాజధాని ప్రాంతంలోని కీలక నగరమైన గుంటూరును ఆధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో ఆర్థిక, సాంకేతిక సహకారం అందించాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ప్రపంచ బ్యాంకు, హడ్కో ప్రతినిధులను కోరారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఆయా సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నగరాభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు.
నగరంలో పారిశుధ్యం, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు రూ. 300 కోట్లతో సీవరేజ్ యుటిలిటీ ప్రాజెక్టు, వ్యాపారులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సదుపాయాలతో రూ. 118 కోట్లతో పీపీకే నాయుడు మార్కెట్ నిర్మాణం, తాగునీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవలను సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షించేందుకు రూ. 53.65 కోట్లతో స్మార్ట వ్యవస్థ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని కమిషనర్ వివరించారు. ఈ మూడు ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ. 471.65 కోట్లు కాగా, వీటి అమలుతో నగర మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.
గుంటూరు నగరపాలక సంస్థ ఆర్థిక పరిస్థితి, ఆదాయ వృద్ధి, పరిపాలనా పారదర్శకత గురించి ప్రతినిధులకు వివరించారు. జీఎంసీ ఆదాయంలో ఏటా 8 నుంచి 15 శాతం వరకు స్థిరమైన వృద్ధి నమోదవుతోందని, ఆడిట్ ప్రక్రియలను కూడా నిర్దిష్ట గడువులోగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. నగర ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులు కల్పించడంతోపాటు జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ ప్రాజెక్టులను త్వరితగతిన కార్యరూపంలోకి తీసుకురావాలని, ఇందుకు ప్రపంచ బ్యాంకు, హడ్కో సంస్థలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, ఏఓ జి. తిరుపతి నాయుడు, ప్రపంచ బ్యాంకు, హడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుబజార్ ఏర్పాటుకి 48.50 లక్షలు నిధులు మంజూరు



చైర్మన్ ఏపీ రవీంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):మైదుకూరు పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా కూరగాయల మార్కెట్ కోసం ఎదురుచూస్తున్న రైతులు మరియు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్
మైదుకూరు రైతు బజార్ నిర్మాణానికి మొదటి విడతగా రూ. 48.50 లక్షల నిధులు మంజూరుకై మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కృషి చేసారు. 18-11-2026 తేదీన మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ,ం గుంటూరు డైరెక్టర్ కార్యాలయం నుండి కీలక ఉత్తర్వులు జారీ చేసారు .ఈ సందర్భంగా రైతు బజార్ నిర్మాణ పనులు ముందుకు సాగడానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కి మైదుకూరు మార్కెట్ యార్డ్

కౌమార బాలికల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



గుంటూరు, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): కౌమార దశ బాలికల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, విద్యా శాఖ, ప్రణాళిక శాఖ అధికారులతో కౌమార దశ బాలికల ఆరోగ్యం ముఖ్యంగా కౌమార దశ బాలికలలో గర్భధారణ అంశంపై బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. జిల్లాలో 12 నుండి 20 సంవత్సరాల లోపు బాలికల వివరాలు సేకరించాలని అన్నారు. వారిలో ఏ ఒక్కరూ డ్రాప్ ఔట్ కాకుండా నిశితంగా పర్యవేక్షణ చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. డ్రాప్ ఔట్‌లు ఉంటే అందుకు గల కారణాలు తెలుసుకొని విద్యార్థిని ఇంటికి వెళ్ళి కౌన్సెలింగ్ ఇచ్చి, పాఠశాల లేదా కళాశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాలకు గురైన బాలికలకు ఒక ప్రశ్నావళిని రూపొందించి, బాల్య వివాహం చేసుకొనుటకు కారణాలు, వివాహం అనంతరం ఎదుర్కొంటున్న సమస్యలు గురించి ప్రశ్నావళి రూపంలో తీసుకుని విశ్లేషణ చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిని ఆదేశించారు. గ్రామాల్లో జరిగే వివాహాన్ని సంబంధిత గ్రామ/వార్డు విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, మహిళా సంరక్షణా కార్యదర్శి, పంచాయతీ సెక్రెటరీకి సమాచారం అందించాలని, బాల్య వివాహము కాదని ధృవీకరించిన తదుపరి వివాహం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివాహం జరిపించు మత పెద్దలకు, కళ్యాణ మండపం, ఫంక్షన్ హాలు యాజమాన్యానికి, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు బాల్య వివాహాలు - బాల్య వివాహ నిషేధిత చట్టములో పొందుపరచిన శిక్షలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.
ప్రతి పాఠశాలలో ఒక కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థులకు బాల్య వివాహం చేసుకొనుట వలన కలుగు అనర్ధాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. 10వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థిని ఉత్తీర్ణురాలు అయ్యే విధంగా తర్ఫీదు ఇవ్వడం, ఉత్తీర్ణత పొందిన అనంతరం తదుపరి కోర్సులలో చేరే విధంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలు జరుగకుండా, కౌమార బాలికలలో గర్భధారణ లేకుండా స్పష్టమైన కార్యాచరణ ఉండాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్వాడీ వర్కర్, రెవెన్యూ అధికారుల బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సామాజిక రుగ్మతగా ఉన్న అంశంను రూపాపాలని, వారి ఆరోగ్యం కాపాడాలని అన్నారు. కౌమార దశ బాలికల ఆరోగ్యం ఆవశ్యమని చెప్పారు.
ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.జి.ప్రసూన, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి.సునీత, డిగ్రీ కళాశాలల ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఇళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

రూ.279 కోట్లకు చేరిన ఈహెచ్ఎస్ చెల్లింపులు



- ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు నెట్‌వర్క్ ఆసుపత్రుల ఖాతాలకు జమ
- మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్):ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) కింద నెట్‌వర్క్ ఆసుపత్రులకు తాజాగా రూ. 78.32 కోట్లను చెల్లించింది. దీంతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు చెల్లింపులు చేసిన మొత్తం రూ. 279 కోట్లకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఈ పథకం కింద మొత్తం రూ. 768 కోట్లను చెల్లించింది. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 135 కోట్లు, 2025-26లో రూ. 354 కోట్లు, 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ. 279 కోట్లు చెల్లించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లింపులపై ఉన్న అనిశ్చితిని తొలగిస్తూ, క్రమం తప్పకుండా చెల్లింపులు చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. తద్వారా ఉద్యోగులకు నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

శంకర్ విలాస్ కూడలి వద్ద డ్రైనేజీ సమస్యకు తక్షణ పరిష్కారం



- నిర్మాణ వ్యర్థాల తొలగింపునకు చర్యలు
- జెట్టింగ్ మెషిన్లతో నిలిచిన నీటి తొలగింపు

గుంటూరు, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్):నగరంలోని శంకర్ విలాస్ కూడలి వద్ద డ్రైనేజీ కాలువ మూసుకుపోవడంతో సమీపంలోని దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన భవనాల కూల్చివేతల సమయంలో వెలువడిన రాళ్లు, ఇసుక, ఇతర నిర్మాణ వ్యర్థాలు డ్రైనేజీ కాలువలో చేరడంతో మురుగునీటి ప్రవాహం నిలిచిపోయిందని 43వ వార్డు కార్పొరేటర్ గాయత్రి రంగావఝుల తెలిపారు.
ఈ సమస్యపై నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షించి, కాలువలో పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలను జేసీబీ యంత్రాల సహాయంతో తక్షణమే తొలగించాలని సూచించినట్లు వెల్లడించారు. తాత్కాలిక ఉపశమన చర్యల్లో భాగంగా జెట్టింగ్ మెషిన్ల ద్వారా కాలువలో నిలిచిపోయిన నీటిని కొంతమేర తొలగించినట్లు పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ



గుంటూరు, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): జిల్లావ్యాప్తంగా రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు కఠినంగా అమలు చేస్తున్నారు. అనధికార వ్యక్తులు, వాహనాలు ఆ పరిధిలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నారు. నిబంధనల ఉల్లంఘనలకు అవకాశం లేకుండా పోలీసు సిబ్బంది నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాలపై డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు పోలీసు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలు, అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

ఎంబీబీయస్‌లో 99.88 శాతం సీట్ల భర్తీ



- 6,937లో 6,929 సీట్లు పొందిన విద్యార్థులు
- వీరిలో 61.34 శాతం అమ్మాయిలే
- నవంబరు 16తో ప్రవేశాల ప్రక్రియ పూర్తి
- మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదిక అందజేసిన ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

అమరావతి, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రంలో మొత్తం 7,465 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, వీటిలో 528 సీట్లను అఖిల భారత కోటాకు కేటాయించారు. మిగిలిన 6,937 సీట్లు రాష్ట్ర పరిధిలో ఉన్నాయి. వీటిలో 6,929 సీట్లు (99.88) భర్తీ అయ్యాయి. కేవలం 8 సీట్లు (0.12 శాతం) మాత్రమే ఖాళీగా మిగిలాయి. భర్తీ అయిన సీట్లలో 4,250 మంది విద్యార్థినులు (61.34 శాతం), 2,679 మంది విద్యార్థులు (38.66 శాతం) ఉన్నారు. ఈనెల 16తో ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. ఈ ప్రవేశాల భర్తీ నివేదికను ఎన్టీఆర్ ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయం రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అందజేసింది.

కన్వినర్ కోటాలో అన్ని సీట్ల భర్తీ: రాష్ట్రంలో కన్వీనర్ కోటా కింద మొత్తం 4,581 సీట్లు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2,631, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 1,950 సీట్లు ఉన్నాయి. ఈ కోటాలోని అన్ని సీట్లూ భర్తీ అయ్యాయి. 1,723 మంది విద్యార్థులు (37.61 శాతం), 2,858 మంది విద్యార్థినులు (62.39 శాతం) ప్రవేశాలు పొందారు.

యాజమాన్య కోటాలో 2,348 సీట్ల భర్తీ: ఈ కోటాలో మొత్తం 2,356 సీట్లు ఉండగా, 2,348 సీట్లు భర్తీ అయ్యాయి. వీటిలో 956 మంది విద్యార్థులు (40.72 శాతం), 1,392 మంది విద్యార్థినులు (59.28 శాతం) ప్రవేశాలు పొందారు. ఈ కోటాలోనూ విద్యార్థినులే అధికంగా ఉన్నారు. ప్రత్యేక చివరి విడత రెండో కౌన్సెలింగ్ అనంతరం ఎన్ఆర్ఐ కేటగిరీలో టిటిడి ఆధ్వర్యంలో నడిచే తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 7, ప్రైవేట్ వైద్య కళాశాలలో ఒక సీటు చొప్పున మిగిలాయి.

విద్యార్థులకు ప్రయోజనకర నిర్ణయం: పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 9, విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలలో 3 చొప్పున (రూ. 20 లక్షలు) సీట్లు మిగిలాయి. వీటిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీలోకి మార్చి(ఫీజు రూ. 12 లక్షలు) భర్తీ చేశారు. తద్వారా అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి.

ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా...: గత వారం దేశ వ్యాప్తంగా 411 ఎంబిబియస్ సీట్లు మిగిలినట్లు ఎన్ఎంసి ప్రకటించింది. అప్పటికి రాష్ట్రంలో ఎన్ఆర్ఐ (కేటగిరి-సి) కోటాలో మిగిలినవి 69 సీట్లు. ఎన్ఎంసి ఇచ్చిన అనుమతితో వీటి భర్తీ కోసం ఆరోగ్య విశ్వవిద్యాలయం రెండు సార్లు ప్రత్యేకంగా(స్ట్రే రౌండ్) కౌన్సెలింగ్ నిర్వహించింది. దీంతో 61 సీట్లు భర్తీ అయ్యాయి. చివరికి 8 సీట్లు మిగిలాయి.

పిడుగురాళ్ల వైద్య కళాశాలలో...: తొలి సారిగా పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశాలు జరిగాయి. ఇక్కడ మొత్తం 50 సీట్లు ఉన్నాయి. వీటిలో 7 అఖిల భారత కోటా, 22 కన్వీనర్ కోటా, 21 యాజమాన్య కోటా సీట్లకు ప్రవేశాలు జరిగాయి.

కన్వీనర్ కోటాలోని మొత్తం 22 సీట్లూ మూడో విడత కౌన్సెలింగ్‌లో భర్తీ అయ్యాయి. సాధారణ కేటగిరీలో 61,593వ ర్యాంకు (524 మార్కులు) నుంచి 1,70,433వ ర్యాంకు (448 మార్కులు) వరకు సీట్లు కేటాయించారు. ఎంబీబీఎస్ ప్రవేశాల్లో విద్యార్థినుల వాటా 61.34 శాతంగా ఉండటం వైద్య విద్యలో మహిళల ప్రాధాన్యం పెరుగుతున్న తీరును స్పష్టం చేస్తోంది. కన్వీనర్, యాజమాన్య కోటాలు రెండింటిలోనూ విద్యార్థినులే అధిక శాతం సీట్లు సాధించడం విశేషం.

ఆటల పోటీలు.. నవ్వుల సందడి..

కృష్ణా తీరాన సచివాలయ ఉద్యోగుల కార్తీక వేడుకలు



రాయపూడి, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): ఎప్పుడూ కార్యాలయ విధుల్లో బిజీగా ఉండే వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది బుధవారం రోజంతా సరదాగా గడిపారు.

గుంటూరు జిల్లా రాయపూడిలో కృష్ణా నది తీరాన కార్తీక వనభోజనాల సందర్భంగా ఆటపాటలతో సందడి చేశారు. సహోద్యోగులనే భావనను పక్కనపెట్టి అందరూ ఒక కుటుంబంలా కలిసిపోయి, ఆత్మీయ పలకరింపులు, నవ్వులు, సరదా పోటీలతో వేడుకను ఆస్వాదించారు.

వెలగపూడి సచివాలయంలోని వైద్యారోగ్య శాఖ అడిషనల్ సెక్రటరీ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమశీ జరిగింది. మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, స్పూన్ అండ్ లెమన్, బాల్ గేమ్స్ తదితర పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తమ సత్తా చాటారు.

గెలుపోటములతో సంబంధం లేకుండా ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ సందడి చేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతుల్ని అడిషనల్ సెక్రటరీ, డెప్యూటీ సెక్రటరీ, అసిస్టెంట్ సెక్రటరీ బహుమతులను అందజేశారు.



కూటమి ధర్మాన్ని పాటిస్తూ నిడదవోలు అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం : మంత్రి కందుల దుర్గేష్

- నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో మంత్రి దుర్గేష్, బూరుగుపల్లి శేషారావుల కీలక సమీక్షా సమావేశం
- నేడు ఎంపీపీ, రేపు జెడ్పీపీ ఎన్నికలు.. సభ్యులందరికీ విప్ జారీ చేయనున్నట్లు ప్రకటన
- ఎంపీపీ, జెడ్ పీపీ గా కూటమి పార్టీలు నిర్ణయించిన అభ్యర్థుల పేర్లను ప్రకటించిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు
- సర్పంచ్, సహకార ఎన్నికల్లోనూ కూటమి జెండా ఎగరాలి-కందుల దుర్గేష్ పిలుపు



నిడదవోలు, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పిటిసిలుగా ఘనవిజయం సాధించిన కూటమి అభ్యర్థులు సమష్టి కృషితో, క్రమశిక్షణతో పనిచేస్తూ నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని తిరుచానూరు శ్రీ పద్మావతి ఫంక్షన్ హాల్‌లో మంత్రి కందుల దుర్గేష్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిడదవోలు టీడీపీ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావుల అధ్యక్షతన కూటమి పార్టీల తరఫున నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలుపొందిన విజేతలను మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. నేడు (గురువారం) జరగనున్న ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం, ఎంపీపీ ఎన్నికలు మరియు రేపు(శుక్రవారం) జరగనున్న జెడ్పీపీ ఎన్నికల ప్రక్రియపై సభ్యులకు దిశానిర్దేశం చేశారు.

విప్ జారీ, ఎన్నికల నిబంధనలపై స్పష్టత: సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గురువారం మధ్యాహ్నం ఎంపీపీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముందుగా ఎంపీటీసీ సభ్యులంతా ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రమాణ స్వీకారం తర్వాతే వారికి ఓటు హక్కు లభిస్తుందని, చేతులెత్తడం ద్వారా ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని వివరించారు. కూటమి తరఫున మూడు జెడ్పీటీసీ స్థానాల్లో రెండు జనసేన, ఒకటి టీడీపీ తీసుకుందని.. అలాగే మూడు ఎంపీపీ స్థానాల్లో రెండు టీడీపీ, ఒకటి జనసేన తీసుకున్నాయని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఎంపీపీ, జెడ్పీపీ ఎన్నికలకు సంబంధించి కూటమి సభ్యులందరికీ విప్ జారీ చేయనున్నామని, ప్రతి ఒక్కరూ విప్‌కు అనుగుణంగా క్రమశిక్షణతో మెలగాలని స్పష్టం చేశారు. విప్ నిబంధనలను అధిగమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని సంబంధిత నిబంధనలను వివరించారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులు సమయపాలన, నిబంధనలను తప్పక తెలుసుకోవాలని, ప్రజాసేవలో రాణించేందుకు ఇది తొలి మెట్టు అని సూచించారు. ఈ సందర్భంగా గురువారం జరగనున్న సమావేశానికి ప్రతి ఒక్క సభ్యుడు విధిగా, తప్పనిసరిగా హాజరుకావాలని మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్ కీలకమని, వారికి ఎంపీటీసీలు సహకరిస్తారని, అలాగే జిల్లా అభివృద్ధికి జెడ్పీటీసీల పాత్ర ఎంతో కీలకమని స్థానిక సంస్థల బాధ్యతలను విడివిడిగా వివరించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులందరికీ భవిష్యత్తులో ఉత్తమ నాయకులుగా ఎదిగే అవకాశాలు ఉంటాయని మంత్రి వారిలో ఉత్సాహం నింపారు.

100 శాతం స్ట్రైక్ రేట్ తో ఘనవిజయం

ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయడం వల్ల దాదాపు 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మూడింటికి మూడు జెడ్పీటీసీ స్థానాలను 11 వేలకు పైగా భారీ మెజారిటీతో కైవసం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గెలుపు కోసం ముందుండి నడిచిన వారితో పాటు తెరవెనుక కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో కూటమి ఉన్నట్లే స్థానిక సంస్థల్లోనూ కూటమి గెలిస్తేనే క్షేత్రస్థాయి అభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాన్ని తాను, బూరుగుపల్లి శేషారావు ఇరువురం కలిసి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లామని మంత్రి గుర్తుచేశారు...రాబోయే ఎంపీపీ, జెడ్పీపీ ఎన్నికల్లో పూర్తిస్థాయి విజయం కూటమిదేనని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు.

క్షేత్రస్థాయి అభివృద్ధికి స్థానిక సంస్థల బలం అవసరం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో 'డబుల్ ఇంజన్ సర్కార్' అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి దుర్గేష్ అన్నారు.

గత రెండున్నర ఏళ్ల కూటమి పాలన అందించిన అభివృద్ధి, సంక్షేమమే ఈ విజయానికి కారణమన్నారు. ఒక ఎమ్మెల్యేగా తాను చేసే అభివృద్ధి ఫలాలు నేరుగా ప్రజలకు చేరాలంటే మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులుగా కూటమి అభ్యర్థులే ఉండాలని అన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో గ్రామ స్వరాజ్యం సాకారం కావాలంటే త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికలు, ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను నూటికి నూరు శాతం గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మరో 15 ఏళ్ల పాటు కూటమి ఇలాగే కొనసాగాలన్న అధినేతల ఆకాంక్షకు అనుగుణంగా, ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

అనంతరం, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిడదవోలు టీడీపీ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు కూటమి తరఫున ఎంపీపీ, జెడ్పీపీ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన అభ్యర్థులతో గ్రూప్ ఫోటోలు దిగారు.

ఎస్ఆర్ఎంను సందర్శించిన జపాన్ బృందం



- క్వాంటం పరిశోధన రంగంలో భారత్-జపాన్ సంయుక్త పరిశోధన అవకాశాలపై చర్చలు

అమరావతి, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): జపాన్‌కు చెందిన న్యూ ఎనర్జీ అండ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ నిపుణుల బృందం బుధవారం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీని సందర్శించింది. క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన రంగాలతో పాటు క్వాంటం కమ్యూనికేషన్స్, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల్లో సంయుక్త పరిశోధన అవకాశాలను అన్వేషించేందుకు ఈ పర్యటన చేపట్టింది. ఈ సందర్భంగా నెదో ప్రతినిధులు ఎస్ఆర్ఎం ఏపీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సీహెచ్. సతీష్ కుమార్, సీనియర్ పరిశోధకులతో సమావేశమై ఇరుపక్షాల పరిశోధనా ప్రాధాన్యతలు, అంతర్జాతీయ పరిశోధన భాగస్వామ్యాలపై చర్చించారు.

న్యూఢిల్లీలోని నెదో కార్యాలయం నుంచి ప్రతినిధులుగా దక్షిణాసియా, మధ్యప్రాచ్య ప్రాంతాల కంట్రీ హెడ్, రీజియన్ హెడ్ మసఫుమి సెండా, డిప్యూటీ చీఫ్ రిప్రజెంటేటివ్ తొషితాకా ఓమియా, న్యూఢిల్లీ కార్యాలయ ప్రతినిధి ధీరజ్ కుమార్ భరద్వాజ్ ఈ బృందంలో పాల్గొన్నారు.

ఈ సమావేశంలో ప్రొఫెసర్ సతీష్ కుమార్ ఎస్ఆర్ఎం లోని పరిశోధనా వ్యవస్థ, విభిన్న విభాగాల సమన్వయంతో పనిచేసే ప్రయోగశాలలు, దీర్ఘకాలిక శాస్త్రీయ లక్ష్యాలను వివరించారు. జపాన్‌లో పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే ప్రధాన ప్రభుత్వ సంస్థగా నెదో పోషిస్తున్న పాత్రను ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. భారతదేశంలోని సాంకేతిక సంస్థలతో అంతర్జాతీయ పరిశ్రమల పరిశోధన భాగస్వామ్యాలను, సరిహద్దులు దాటి సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాలను తమ న్యూఢిల్లీ కార్యాలయం ఎలా సమన్వయం చేస్తుందో తెలియజేశారు. క్యాంపస్ పర్యటనలో భాగంగా ప్రతినిధి బృందం క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ, క్వాంటం రీసెర్చ్ సెంటర్లను సందర్శించి అక్కడి ప్రయోగాత్మక పరిశోధన వ్యవస్థలను పరిశీలించింది. ఈ సందర్భంగా మసఫుమి సెండా మాట్లాడుతూ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ-ఏపీలోని క్యాంపస్ వాతావరణం, పరిశోధనా మౌలిక సదుపాయాలు ఉన్నతస్థాయి విద్యా, పరిశోధనలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని ప్రశంసించారు. ముఖ్యంగా యూనివర్సిటీలోని క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ తనను విశేషంగా ఆకట్టుకుందని పేర్కొన్నారు. జపాన్‌లో ప్రస్తుతం ఎస్ఆర్ఎం ఏపీ పూర్వ విద్యార్థులు గణనీయమైన సంఖ్యలో ఉద్యోగాలు చేస్తుండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు కెరీర్‌ను నిర్మించుకునేందుకు యూనివర్సిటీ అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. భవిష్యత్తులో నెదో, ఎస్ఆర్ఎం ఏపీ మధ్య మరిన్ని పరిశోధనా భాగస్వామ్యాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మరో ప్రతినిధి తొషితాకా ఓమియా క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రత్యేకంగా పరిశీలించారు. భారతీయ విద్యా రంగంలో ప్రత్యేకమైన ప్రయోగాత్మక క్వాంటం మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంలో ఎస్ఆర్ఎం ఏపీ ముందంజలో ఉందని ప్రశంసించారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన, అందరికీ అందుబాటులో ఉండే క్వాంటం కంప్యూటింగ్ టెస్ట్‌బెడ్‌గా ఈ ఫెసిలిటీ పనిచేస్తోందని వివరించారు. వాస్తవిక నిర్వహణ పరిస్థితుల్లో క్వాంటం హార్డ్‌వేర్‌పై ప్రత్యక్షంగా పనిచేసే అవకాశాన్ని ఇది కల్పిస్తోందని పేర్కొన్నారు. ఈ సదుపాయం ద్వారా విద్యార్థులు, యూనివర్సిటీ పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు క్వాంటం సాంకేతిక పరిజ్ఞాన అనువర్తనాలను పరీక్షించడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పరిశోధనలు చేపట్టేందుకు విలువైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

రోగులకు మెరుగైన సేవల్లో దాతల సహకారం అవసరం



- జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి దుర్గాప్రసాద్

గుంటూరు, నవంబరు 18 (జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వాసుపత్రికి వచ్చే వందలాదిమంది రోగులకు సౌకర్యాలు కల్పించడంతో ప్రభుత్వంతోపాటు దాతలు సహకరించటం ద్వారానే మరింతగా మెరుగైన సేవలు అందుతాయని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోరిజాలు దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.

ప్రముఖ స్వచ్ఛంద సేవకులు వల్లూరి సదాశివరావు వెంకటరత్నం దంపతులు మనుమడి పేరున, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కె సాంబిరెడ్డి ఈశ్వరి దంపతులు, ఆర్య సమాజం అధ్యక్షులు గుర్రం నిర్మలాదేవి వేణుగోపాలరావు దంపతులు మూడు స్ట్రెచర్లను సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్ ద్వారా సూపరిం టెండెంట్ కార్యాలయం ముందు ఆసుపత్రి సేవలకు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులను అత్యవసర పరిస్థితులలో ఒకచోట నుండి మరొకచోటకు వివిధ రకాల పరీక్షల నిమిత్తం, ఆపరేషన్ల నిమిత్తం స్ట్రెచ్చర్స్, వీల్ చైర్స్ ఎంతగానో ఉపకరిస్తాయని చెప్పారు. నిరంతరం వాడటం వల్ల ప్రతి సంవత్సరం రిపేర్లకు రావటం, కొన్ని పాడవటం వల్ల ఎప్పటికప్పుడు కొత్తవి సమకూర్చుకోవాల్సి వస్తుందన్నారు. కొత్తగా దాతలు గత కొద్దికాలంలో 30 వరకు స్ట్రెచ్చర్స్ అందించారని ఇంకా 100కు పైగా అవసరం ఉన్నదని తెలియజేశారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ప్రజా ఆలోచనా వేదిక అధ్యక్షులు మేదూరి రాజేంద్రప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి డైజాన్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతుల మురళి కృష్ణ, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీకాంత్, వల్లూరి వెంకటేష్ సుష్మ, హన్విక్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 12న ఢిల్లీలో 'చలో ఢిల్లీ - కర్మచారి ఆక్రోశ్ ర్యాలీ'

- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి
- ఏపీఎన్జీజీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ పిలుపు

విజయవాడ, నవంబర్ 18(జర్నలిస్ట్ ఫైల్): ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2026 డిసెంబర్ 12వ తేదీన న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ -- కర్మచారి ఆక్రోశ్ ర్యాలీ'లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, (ఎ.ఐ.ఎస్.జి.ఈ.ఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు ఏపి ఎన్ జి ఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ పిలుపునిచ్చారు.

కర్మచారి ఆక్రోస్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్‌జీజీఓ హోమ్‌లో ఎ. విద్యాసాగర్, ఏపీఎన్జీజీఓస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ స్థాయిలో ఉద్యమానికి పిలుపునిచ్చిందని తెలిపారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పెన్షనర్ల సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమే ఈ ర్యాలీ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.



కర్మచారి ఆక్రోస్ ర్యాలీ ద్వారా ప్రధానంగా డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. ఈ చట్టం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకంగా ఉండి అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ తక్షణమే భర్తీ చేయాలని కోరారు పాత పెన్షన్ విధానం (ఓ.పి.ఎస్)పునరుద్ధరించి, నూతన పెన్షన్ విధానాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ.పి.ఎస్-95 పెన్షనర్లకు కనీస పెన్షన్‌తో పాటు నిర్వచిత ప్రయోజనాలు కల్పించే పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను తక్షణమే నిలిపివేయాలని కార్మికుల హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులందరికీ ప్రభుత్వ సహకారంతో సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలి. అన్ని ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాల తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేతను నిలిపివేసి, పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. ఆర్.టి.ఏ చట్టం అమలుకు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు తప్పనిసరి చేసిన టెట్ నిబంధనలను ఉపసంహరించుకోవాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 310, 311(2)(a), (b), (c)లను రద్దు చేయాలి. ఇ.ఎస్.యం.ఏ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డి.ఏ/డి.ఆర్) బకాయిలతో పాటు కోవిడ్ సమయంలో నిలిపివేసిన 18 నెలల డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించే పెన్షన్ వాలిడేషన్ చట్టం-2025ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

ఈ డిమాండ్లన్నీ కేవలం ఉద్యోగుల సమస్యలకే పరిమితం కావని, దేశంలోని ప్రభుత్వ వ్యవస్థ, కార్మికుల హక్కులు, సామాజిక భద్రత, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణకు సంబంధించిన కీలక అంశాలని నాయకులు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సానుకూలంగా స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

డిసెంబర్ 12న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగే 'చలో ఢిల్లీ - కర్మచారి ఆక్రోశ్ ర్యాలీ'తో పాటు అనంతరం నిర్వహించే బహిరంగ సభకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఐక్యతను చాటాలని ఏపీఎన్జీజీఓస్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ముజీఫర్ అహ్మద్, ఏఐఎస్‌జీఈఎఫ్ ఉమెన్ సబ్ కమిటీ కన్వీనర్ ఎం. రాజలక్ష్మి, ఎన్ఈసీ సభ్యురాలు వి. శాంతిశ్రీ, ఏపీఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్. భారతి ప్రసాద్, బి. జానకి, వి. సుబ్బారెడ్డి, ఎల్. రజనీష్ బాబు, యం. సరస్వతి, మహిళా విభాగం జాయింట్ కన్వీనర్ పి. సురేఖ, క్యాపిటల్ సిటీ అధ్యక్షులు సి. హెచ్. నాగభూషణం, కార్యవర్గ సభ్యులు కిషోర్ బాబు, మురళీమోహన్, లలితాంబ, దాసు, రామకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు డి. సత్యనారాయణ రెడ్డి, పి. రమేష్, వి.వి. ప్రసాద్, సతీష్, రామకృష్ణ, విజయవాడ నగర శాఖ అధ్యక్షులు సి. హెచ్. సి.వి.ఆర్. ప్రసాద్, కోశాధికారి డి.ఎన్.యన్. శ్రీనివాస్ ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

<ant